# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 16-9-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 39 పేజీలు:6 వెల: రూ.1/-


## తెలంగాణ సచివాలయానికి అంబేద్కర్ పేరు: పీయూసీ చైర్మన్ జీవన్ రెడ్డి హర్షం

హైదరాబాద్, సెప్టెంబర్ 15: తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టడం పట్ల పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే, టీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక నిర్ణయంగా ఆయన అభివర్ణించారు. అంబేద్కర్ పట్ల ఉన్న గౌరవాన్ని సీఎం కేసీఆర్ మరోసారి సగర్వంగా చాటుకున్నారని ఆయన ప్రశంసించారు.

పార్లమెంట్ భవనానికి కూడా అంబేద్కర్ పేరును పెట్టి బీజేపీ ప్రభుత్వం తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 3ని అంబేద్కర్ పొందుపర్చడం వల్లే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు సాగుతున్న తెలంగాణ పరిపాలనా సముదాయమైన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టాలని సీఎం కెసిఆర్ నిర్ణయించడం తెలంగాణకే గర్వకారణమని ఆయన తెలిపారు.సీఎం కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం భారతదేశానికి ఆదర్శమని ఆయన స్పష్టం చేశారు. అంబేద్కర్ స్ఫూర్తితో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వం మరో చారిత్రక నిర్ణయాన్ని తీసుకుందని ఆయన పేర్కొన్నారు.

## పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టే వరకు పోరాడుతాం : ఎంపీ వద్దిరాజు

హైదరాబాద్, సెప్టెంబర్ 15: తెలంగాణ రాష్ట్ర ప్రధాన పరిపాలనా భవనం సచివాలయానికి భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పేరు పెట్టాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడం పట్ల రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హర్షం వ్యక్తం చేశారు.

పార్లమెంట్ నూతన భవనానికి కూడా అంబేద్కర్ పేరు పెట్టే వరకు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచుతూనే ఉంటామన్నారు. అలాగే ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ కు అంబేద్కర్ గొప్ప రాజ్యాంగాన్ని అందించారని, అందులో పొందుపర్చిన ఆర్టికల్ 3 వల్లనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందన్నారు.

కేసీఆర్ ఆ మహనీయుడిని ఆదర్శంగా తీసుకుని అన్ని వర్గాల ప్రజల భద్రత, సంక్షేమం, సముద్ధరణకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని వద్దిరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన గొప్పతనాన్ని భవిష్యత్ తరాల వాళ్లు తెలుసుకునేందుకు గాను హుస్సేన్ సాగర్ తీరాన 125 అడుగులలో విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తూ స్మృతి కేంద్రాన్ని గొప్పగా ఏర్పాటు చేస్తున్నారన్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితోనే అన్ని వర్గాల వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే దృఢ సంకల్పంతో 1,000 గురుకులాలను నడిపిస్తున్నారని వివరించారు. అసెంబ్లీ తీర్మానం పట్ల సానుకూల నిర్ణయం వచ్చే వరకు టీఆర్ఎస్ కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచుతూనే ఉంటుందని వద్దిరాజు స్పష్టం చేశారు.

## అంబేద్కర్‌పై గౌరవాన్ని సీఎం కేసీఆర్ మరోసారి సగర్వంగా చాటారు : కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 15: : తెలంగాణ సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టడంపై టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక నిర్ణయంగా అభివర్ణించారు. అంబేద్కర్‌పైన ఉన్న గౌరవాన్ని సీఎం కేసీఆర్ మరోసారి సగర్వంగా చాటుకున్నారన్నారు. పార్లమెంట్ భవనానికి కూడా అంబేద్కర్ పేరును పెట్టి బీజేపీ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్-3ని అంబేద్కర్ పొందుపరచడంతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు.

అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు సాగుతున్న తెలంగాణ పరిపాలన సముదాయమైన సచివాలయానికి రాజ్యాంగ నిర్మాత పేరు పెట్టాలని సీఎం నిర్ణయించడం తెలంగాణకే గర్వకారణమన్నారు. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం భారతదేశానికి ఆదర్శమని స్పష్టం చేశారు. అంబేద్కర్ స్ఫూర్తితో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వం మరో చారిత్రక నిర్ణయాన్ని తీసుకుందని చెప్పారు.

ఢిల్లీలో నూతనంగా నిర్మిస్తున్న పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని సీఎం కేసీఆర్ చేస్తున్న డిమాండ్‌ను, తెలంగాణ అసెంబ్లీ పంపించిన తీర్మానాన్ని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్వీకరించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెడితే భారతదేశం ప్రతిష్ట గౌరవం ప్రపంచవ్యాప్తంగా మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టి రాజ్యాంగంపై ఉన్న చిత్తశుద్ధిని బీజేపీ నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఈ దిశగా తెలంగాణ బీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కవిత సూచించారు.

## లారీ, బొలెరో వాహనం ఢీ.. ముగ్గురు మృతి

అమరావతి, సెప్టెంబర్ 15: కాకినాడ జిల్లా జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. తుని మండలం వెలమకొత్తూరు వద్ద లారీ, బొలెరో వాహనం ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విశాఖ నుంచి శ్రీరంగపట్నం వెళ్తున్న బొలెరో వాహనం ఆగిఉన్న లారీని ఢీ కొట్టడంతో బొలెరో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే చనిపోగా తుని ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అమిత్‌షాకు వ్యతిరేకంగా పరేడ్ గ్రౌండ్స్‌లో వెలసిన పోస్టర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 15: కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా నగరంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో పోస్టర్లు వెలిశాయి. సెప్టెంబర్ 17 సందర్భంగా అమిత్ షా.. హైదరాబాద్ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న సభలో పాల్గొననున్నారు. ఈ క్రమంలో తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఏ విధంగా సాయపడిందో చెప్పాలని డిమాండ్ చేస్తూ పరేడ్ గ్రౌండ్స్ పరిధిలో పోస్టర్లు వెలిశాయి. కంటోన్మెంట్ యువత పేరుతో ఉన్న ఈ పోస్టర్లలో కేంద్ర ప్రభుత్వం ప్రశ్నల అస్త్రాలు సంధించారు.

### చరిత్రలో నేటినిజం



(సెప్టెంబర్ 16 మీనా పుట్టినరోజు..)

-రాధశ్రీ
సెల్:9494481210



# తెలంగాణ నూతన సచివాలయానికి డా.అంబేద్కర్ పేరు-నిర్ణయించిన సీఎం కేసీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 15: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహేబ్ అంబేద్కర్‌కు తెలంగాణ ప్రభుత్వం సమున్నత గౌరవం కల్పించింది. కొత్తగా నిర్మిస్తున్న సచివాలయానికి రాజ్యాంగ నిర్మాత పేరును పెట్టాలని సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇందుకు సంబంధించి చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కేంద్ర పరిపాలనా సముదాయ భవనమైన సెక్రటేరియట్‌కు భారత సామాజిక దార్శనికుడు మహామేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును నామకరణం చేయడం తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణమన్నారు.

ఈ నిర్ణయం భారతదేశానికే ఆదర్శమన్నారు. భారత ప్రజలందరికీ అన్ని రంగాల్లో సమాన గౌరవం దక్కాలనే అంబేద్కర్ మహాశయుని తాత్వికతను తెలంగాణ ప్రభుత్వం అందిపుచ్చుకుని ముందుకు సాగుతున్నదన్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సబ్బండ వర్గాలను సమున్నత స్థాయిలో నిలుపుతూ కొనసాగిస్తున్న స్వయం పాలన రాష్ట్రం ఏర్పాటైన అనతి కాలంలోనే దేశానికి ఆదర్శంగా నిలువడం వెనక డాక్టర్ అంబేద్కర్ ఆశయాలు ఇమిడి ఉన్నాయన్నారు. అంబేద్కర్ దార్శనికతతో రాజ్యాంగంలో ఆర్టికల్-3 పొందుపరచడం ద్వారా మాత్రమే తెలంగాణ నేడు ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైందన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా వర్గాలతో పాటు పేదలైన అగ్రకులాల ప్రజలకు కూడా మానవీయ పాలన అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని అమలు చేస్తున్నదన్నారు. అంబేద్కర్ కలలుగన్న భారతదేశంలో భిన్నత్వంతో కూడిన ప్రత్యేక ప్రజాస్వామిక లక్షణం ఉన్నదని పేర్కొన్నారు. ఫెడరల్ స్ఫూర్తిని అమలు చేయడం ద్వారా మాత్రమే అన్ని వర్గాలకు సమాన హక్కులు అవకాశా లు కల్పించబడుతాయనే అంబేద్కర్ స్ఫూర్తి మమ్మల్ని నడిపిస్తున్నదన్నారు. భారతదేశ ప్రజలు కుల, మత, లింగ, ప్రాంతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలు సమానంగా గౌరవించబడి, అందరికీ సమాన అవకాశాలు కల్పించబడడమే నిజమైన భారతీయత ఆనాడే నిజ భారతం ఆవిష్కృతమౌతుందని అభిప్రాయపడ్డారు.

అందుకోసం మావంతు కృషి కొనసాగుతుందని తెలిపారు. అన్ని రంగాల్లో దార్శనికతతో ముందుకుపోతూ, అనతి కాలంలోనే దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ రాష్ట్రం, అంబేద్కర్ మహాశయుని పేరును రాష్ట్ర సెక్రటేరియట్‌కు పెట్టడం ద్వారా మరోసారి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదన్నారు. భారత నూతన పార్లమెంట్ భవనానికి సైతం అంబేద్కర్ పేరును పెట్టాలని ఏదో ఆశామాషీకి కోరుకున్నది కాదని, భారత దేశ గౌరవం మరింతగా ఇనుమడించబడాలంటే, భారత సామాజిక తాత్వికుడు రాజ్యాంగ నిర్మాత పేరును మించిన పేరు లేదనే విషయాన్ని ఇటీవలే అసెంబ్లీ సాక్షిగా ప్రకటించుకున్నామన్నారు.

అందుకు సంబంధించిన తీర్మానాన్ని కూడా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించిందని గుర్తు చేశారు. ఇదే విషయమై భారత ప్రధానికి త్వరలో స్వయంగా లేఖ రాయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుని నూతనంగా నిర్మిస్తున్న భారత పార్లమెంట్ భవనానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును పెట్టాలని తాను మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

# ఇన్నాళ్లు ఎందుకు ఇంటింటికీ నీళ్లివ్వాలనే ఆలోచనెందుకు రాలే : కేటీఆర్




హైదరాబాద్, సెప్టెంబర్ 15: 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో ఇంటింటికీ నీళ్లు ఇవ్వాలనే ఆలోచన ఎందుకురాలేదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ప్రశ్నించారు. రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము వచ్చాక వాళ్ల ఊరుకు కరెంటు వచ్చిందని, 2022 వరకు కూడా కరెంట్, నీళ్లు లేని ఇల్లు దేశంలో ఉండడం మన దురదృష్టమన్నారు. క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఫర్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ నిర్వహిస్తున్న 36వ చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్స్ కార్యక్రమానికి మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మనకు క్వాలిటీ అనగానే విదేశాలు గుర్తుకు వస్తాయన్నారు. భారత్ అంటేనే శక్తివంతమైన దేశమని, 1986లో చైనా, భారత్ రెండు దేశాల జీడీపీ ఒకేరంగా ఉండేదన్నారు. కానీ, ఇప్పుడు 5.7శాతం ఎక్కువ వృద్ధి రేటు సాధించిందన్నారు. చైనా అంత వృద్ధి రేటు అంత పెరగడానికి మూడు కారణాలు ఉన్నాయని తెలిపారు. సింగిల్ మైండ్ ఫోకస్ థింగ్స్, ప్రపంచ అతిపెద్ద ఫార్మా క్లస్టర్లతో ముందుకెళ్తోందన్నారు.

అద్భుతమైన క్వాలిటీ మనదగ్గర ఉందని, క్వాలిటీ తక్కువగా ఉన్న చైనా ముందుకెళ్తోందని.. కానీ, క్వాలిటీ ఉన్న మనం ఎందుకు ముందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. ఇక్కడ కుల, మతాలు చూస్తూ వెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవే మాటలతో నాలుగు ఓట్లు సంపాదించుకునే ప్రయత్నం తప్ప వేరే ఆలోచన లేదన్నారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎనిమిదేళ్ల కిందట తెలంగాణ రాక ముందు పరిశ్రమ రంగం, తెలంగాణ వచ్చాక, కేటీఆర్ పరిశ్రమల మంత్రి అయ్యాక ఎలా ఉందో ఒక్కసారి ఆలోచించుకోవచ్చు అన్నారు. కరెంట్ లేక పవర్ హాలీడేలు ఉండేవని, ఇన్ఫ్రాస్ట్రక్చర్ కూడా కుదేలైందన్నారు. టీఎస్ ఐ పాస్‌తో పరిశ్రమల అనుమతులు వేగంగా జరుగుతున్నాయన్నారు. 24 గంటల కరెంటుతో పారిశ్రామిక రంగం ముందుకెళ్తుందని తెలిపారు. కేటీఆర్ నాయకత్వంలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ పెరిగిందని, కేటీఆర్ తీసుకున్న నిర్ణయాలతో ఐటీ, ఇండస్ట్రీ సెక్టార్లు దేశంలో మొదటి స్థానంలో నిలిచాయని ప్రశంసించారు. టీ హబ్ ప్రపంచ స్థాయి గుర్తింపు పొంది, మొదటి స్థానంలో నిలిచిందని, టీ వర్క్స్ అనే సంస్కరణ గొప్పగా సాగుతోందన్నారు.

# సెప్టెంబర్ 17న మధ్య ప్రదేశ్‌ను సందర్శించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సెప్టెంబర్ 17వ తేదీ నాడు మధ్య ప్రదేశ్ ను సందర్శించనున్నారు. ఆ రోజు న ఉదయం సుమారు 10:45 నిమిషాల ప్రాంతం లో కొన్ని చిరుతల ను ప్రధాన మంత్రి కూనో నేశనల్ పార్క్ లోకి వదలి పెడతారు. ఆ తరువాత దాదాపు గా మిట్టమధ్యాహ్నం 12 గంటల వేళ కు ఆయన శ్యోపుర్ లోని కరాహల్ లో జరిగే స్వయంసహాయ సమూహాల (ఎస్ హెచ్ జి) సమ్మేళనం లో మహిళా ఎస్ హెచ్ జి సభ్యులు/కమ్యూనిటి రిసోర్స్ పర్సన్స్ తో కలసి పాల్గొననున్నారు.

చిరుతపులుల ను ప్రధాన మంత్రి కూనో నేశనల్ పార్క్ లో వదలి పెట్టడడం భారతదేశం లో వన్యజీవుల వివిధీకరణ కు మరియు వాటి ఆవాసాల కు నూతన చైతన్యాన్ని ఇవ్వడానికి ఆయన చేస్తున్నటువంటి ప్రయత్నాల లో ఒక భాగం గా ఉన్నది. చిరుతపులి సంతతి భారతదేశం లో మటుమాయం అయిందంటూ 1952వ సంవత్సరం లో ప్రకటన చేయడం జరిగింది. ప్రస్తుతం వదలిపెట్టబోతున్నటువంటి చిరుత లు నమీబియా కు చెందినవి. ఈ సంవత్సరం మొదట్లో సంతకాలు జరిగిన ఒక ఎంఒయు లో భాగం గా వాటిని తీసుకురావడమైంది. భారతదేశం లో చిరుతల ను ప్రవేశపెట్టడం అనేది 'ప్రాజెక్ట్ చీతా' లో ఒక భాగం గా ఉంది. 'ప్రాజెక్ట్ చీతా' అనేది వన్య మాంసాహారి జీవుల ఖండాంతర స్థానాంతరణ కు సంబంధించిన పథకాలలో ప్రపంచంలోకెల్లా తొలి దొడ్డ పథకం అని చెప్పాలి.

చిరుతలు భారతదేశం లో బహిరంగ అరణ్యాలు మరియు పచ్చికభూమి సంబంధి ఇకోసిస్టమ్స్ పునరుద్ధరణ కు సహాయకారి కానున్నాయి.

ఇది జీవవైవిధ్యం సంరక్షణ తో పాటుగా జల భద్రత, వాతావరణం లో నుండి కర్బనాన్ని వేరుచేయడం, నేలల్లోని తేమ ను కాపాడడం వంటి ఇకోసిస్టమ్ సర్వీసెజ్ ను వృద్ధి చెందింప చేసి, తద్వారా విస్తృత సమాజాని కి లబ్ధి చేకూర్చడం లో దోహదపడనుంది. ఈ ప్రయాస పర్యావరణ పరిరక్షణ మరియు వన్యజీవి సంరక్షణ దిశ లలో ప్రధాన మంత్రి యొక్క వచనబద్ధత కు అనుగుణం గా ఉంది. అంతేకాకుండా, ఇకోటూరిజమ్ మరియు ఇకో-డెవలప్‌మెంట్ కార్యకలాపాల ద్వారా స్థానిక సముదాయాని కి బ్రతుకుదెరువు తో జతపడ్డ అవకాశాల ను పెంచేందుకు కూడా దోవ తీయనుంది.

ప్రధాన మంత్రి శ్యోపుర్ లో కరాహల్ లో ఏర్పాటవుతున్న ఎస్ హెచ్ జి సమ్మేళనం లో పాల్గొనను న్నారు. దీన్ దయాళ్ అంత్యోదయ యోజన-నేశనల్ రూరల్ లైవ్ లీ హుడ్ స్ మిశన్ (డిఎవై- ఎన్ఆర్ఎల్ఎమ్) లో భాగం గా ప్రోత్సాహాన్ని అందజేస్తున్నటువంటి వేల కొద్దీ మహిళా స్వయం సహాయ సమూహాల సభ్యులు/ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ ఈ సమ్మేళనాని కి తరలివస్తారు.

ఇదే కార్యక్రమం లో, పిఎమ్ కౌశల్ వికాస్ యోజన లో భాగం గా పర్ టిక్యులర్ లీ వల్ నరబుల్ ట్రైబల్ గ్రూప్స్ (పివిటిజి) కి చెందిన నాలుగు నైపుణ్య కేంద్రాల ను కూడా ప్రధాన మంత్రి ప్రారంభించనున్నారు.

గ్రామీణ ప్రాంతాల కు చెందిన పేద కుటుంబాల ను దశల వారి గా ఎస్ హెచ్ జి లో చేరే అవకాశం ఇచ్చి, వారు వారి యొక్క జీవనోపాధి మార్గాల ను విధవిధాలు గా తీర్చిదిద్దుకొనేందుకు అవసరమైన దీర్ఘకాలిక సమర్థన ను అందించడం, వారి ఆదాయాల ను మరియు జీవన నాణ్యత ను మెరుగు పరచాలి అనేవి దీన్ దయాళ్ అంత్యోదయ యోజన-నేశనల్ రూరల్ లైవ్ లీ హుడ్ స్ మిశన్ యొక్క లక్ష్యాలు గా ఉన్నాయి. అంతేకాకుండా, గృహహింస, మహిళల్లో విద్యః వ్యాప్తి, ఇంకా ఆడ- మగ మధ్య భేదభావం ప్రధానంగా తలెత్తే సమస్యలు, పోషణవిజ్ఞానం, పారిశుధ్య నిర్వహణ, ఆరోగ్యం తదితర అంశాల లో చైతన్యాన్ని తీసుకురావడం, ప్రవర్తన లో మార్పు కోసం అవసరమైన సమాచారాన్ని అందించడం వంటి వాటి ద్వారా మహిళా ఎస్ హెచ్ జి సభ్యుల కు సాధికారిత కల్పన దిశ గా కూడా ఈ మిశన్ పాటుపడుతున్నది.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఆసరా పెన్షన్లు : మంత్రి తలసాని



హైదరాబాద్, సెప్టెంబర్ 15: : అర్హులైన ప్రతి ఒక్కరికి ఆసరా పెన్షన్‌లు అందజేస్తాం. ఎవరు కూడా అధైర్య పడొద్దని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సనత్ నగర్‌లో ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు గుర్తింపు కార్డులను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోడెడ్ల లాగా ఒకే విధంగా అమలు అవుతున్నాయి. సీఎం కేసీఆర్ సబ్బండ వర్ణాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

వజ్రోత్సవాల సందర్భంగా 10 లక్షల మందికి నూతనంగా పెన్షన్‌లు పంపిణీ చేస్తున్నాం. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## ప్రధాన మంత్రి ఉజ్బెకిస్తాన్ సందర్శనకు బయలుదేరి వెళ్ళే ముందు జారీ చేసిన ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: శంఘాయి సహకార సంస్థ (ఎస్ సిఒ) దేశాధినేతల మండలి సమావేశాని కి హాజరు కావడం కోసం ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు శ్రీ శావ్ కత్ మిర్జియోయెవ్ ఆహ్వానించిన మీదట సమర్ కంద్ ను నేను సందర్శించనున్నాను.

ఎస్ సిఒ శిఖర సమ్మేళనం లో నేను సమయోచిత అంశాలు, ప్రాంతీయ అంశాలు, అంతర్జాతీయ అంశాలు, ఎస్ సి ఒ యొక్క విస్తరణ, సంస్థ పరిధి లో పరస్పర హితకరమైన సహకారాన్ని మరియు బహుపక్షీయ సహకారాన్ని మరింతగా విస్తరించడం పై అభిప్రాయాల ను తెలియజేయడం కోసం, అన్య పక్షాల అభిప్రాయాల ను తెలుసుకోవడం కోసం నేను ఉత్సుకత తో ఉన్నాను. వ్యాపారం, ఆర్థిక వ్యవస్థ, సంస్కృతి మరియు పర్యటన రంగాల లో పరస్పర సహకారాని కి సంబంధించిన అనేకమైన నిర్ణయాల ను ఉజ్ బెక్ అధ్యక్షతన ఆమోదించే సూచన లు ఉన్నాయి.

సమర్ కంద్ లో అధ్యక్షుడు శ్రీ మిర్జియోయెవ్ తో సమావేశం కావడం కోసం కూడాను నేను వేచివున్నాను. ఆయన 2018వ సంవత్సరం లో భారతదేశాన్ని సందర్శించడాన్ని నేను ఆత్మీయం గా జ్ఞప్తి కి తెచ్చుకొంటున్నాను. ఆయన 2019వ సంవత్సరం లో జరిగిన వైబ్రంట్ గుజరాత్ సమిట్ కు కూడాను గౌరవ అతిథి గా విచ్చేశారు. దీనికి అదనం గా, నేను సమిట్ కు హాజరు అవుతున్న ఇతర నాయకుల లో కొందరి తో ద్వైపాక్షిక సమావేశాల ను నిర్వహిస్తాను.

## విద్యార్థుల కష్టాలు చూసి.. బస్సు సౌకర్యం కల్పించిన ఆర్టీసీ చైర్మన్

హైదరాబాద్, సెప్టెంబర్ 15: తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి నిజామాబాద్ మార్గమధ్యంలో చేగుంట సమీపంలో మోడల్ స్కూల్ విద్యార్థులు పడుతున్న అవస్థలను చూశారు. వాహనాన్ని నిలిపి.. విద్యార్థుల సమస్యలు, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆటో కోసం వేచి చూస్తున్నామని విద్యార్థులు సమాధానమిచ్చారు.

స్పందించిన ఆయన ఆటో ప్రయాణం సురక్షితం కాదని.. ఆటోనిండా ప్రమాదకరంగా తెలిపిన ఆయన.. వెంటనే మెదక్ రీజనల్ మేనేజర్‌కు ఫోన్ చేశారు. చేగుంట మోడల్ స్కూల్ నుంచి నర్సింగ్ మున్సిపల్ పట్టణానికి వెంటనే బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఆర్టీసీ చైర్మన్ ఆదేశించారు. శుక్రవారం నుంచి విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం సమయంలో బస్ సర్వీసులను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. మోడల్ స్కూల్‌కు బస్సు సౌకర్యం కల్పించినందుకు ఆర్టీసీ చైర్మన్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు నర్సింగ్ ప్రాంత ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

## రోజుకు 19 కిలో మీటర్లు మందగించిన రహదారి నిర్మాణం

హైదరాబాద్, సెప్టెంబర్ 15: అభివృద్ధికి ప్రాతిపదికగా భావించే రహదారుల నిర్మాణం ఈ ఏడాది దేశ వ్యాప్తంగా దారుణంగా పడిపోయింది. గత సంవత్సరం (2020-21) రికార్డు స్థాయిలో రోజుకు 37 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం జరగ్గా, ఈ సారి 2021-22లో రోజుకు 28.64 కిలోమీటర్లకు తగ్గడం గమనార్హం. అధికారిక గణాంకాల ప్రకారం దేశంలో జాతీయ రహదారుల నిర్మాణ వేగం 2020-21లో అది రోజుకు 28.64 కిలోమీటర్లకు తగ్గింది. రహదారుల మంత్రిత్వ శాఖ 2022 ఆగస్టు వరకు 2,912 కిలోమీటర్ల జాతీయ రహదారులను నిర్మించింది. ఇక 2020-21 సంవత్సరం ఆగస్టు వరకు 3,356 కిలోమీటర్ల మేరకు జరిగిన నిర్మాణాలతో పోలిస్తే.. ఈ ఏడాది అదే కాలంలో ఇది కేవలం 2,506 కిలోమీటర్లు మాత్రమే జరిగినట్లు గుణాంకాలు చెబుతున్నాయి.

కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నివేదికల ప్రకారం రహదారుల నిర్మాణం మందగించడానికి నిధుల లేమి ఒక కారణం కాగా, వనరుల కొరత మరో కారణం అని తెలుస్తోంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జాతీయ రహదారుల నిర్మాణ లక్ష్యం 12,000 కిలో మీటర్లు. ఇక 2019 -20లో 10,237 కిలో మీటర్లు, 2020-21లో 13,321 కిలోమీటర్లు, 2021-22లో 10,438 కిలోమీటర్ల మీర జాతీయ రహదారుల నిర్మాణం జరిగింది.

కాగా జాతీయ రహదారుల నిర్మాణంలో ప్రత్యేకించి.. స్థల సేకరణతో పాటు నిధుల మంజూరులో జాప్యం సహా మరికొన్ని అంశాలు జాప్యానికి దోహదం చేస్తున్నట్లు కేంద్రం భావిస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయ రహదారుల నిర్మాణంలో వేగం చోటు చేసుకోని పక్షంలో.. ఈ ప్రభావం ఇతరిత్ర పలు అంశాలపై ప్రభావం చూపించే ప్రమాదమున్నట్లు కేంద్రం ఆందోళన చెందుతున్నట్లు సంబంధిత వర్గాల నుంచి వినవస్తుంది. ఈ క్రమంలోనే.. జాతీయ రహదారుల నిర్మాణ పనుల్లో వేగం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా జాతీయ రహదారుల నిర్మాణ పనుల్లో వేగం పెంచేందుకు ప్రత్యేకంగా ఓ కమిటీని నియమించాలని, జాతీయ, అంతర్జాతీయ నిర్మాణ సంస్థలతో పాటు ఆయా రంగాల నిపుణులను ఇందులో సభ్యులుగా నియమించాలని యోచిస్తున్నట్లు సమాచారం.

# అంతర్జాతీయ సమాజం ఓజోన్ పొర పరిరక్షణకు నడు బిగించాలి..!

## (16 సెప్టెంబర్ 'అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం' సందర్భంగా)

పర్యావరణంలోని స్ట్రాటోవరణంలో (15-35 కిమీ దూరాన) సహజ రసాయన ప్రక్రియల్లో ఏర్పడిన ఓజోన్ పొర గొడుగులా పని చేస్తూ, సూర్యకాంతిలోని ప్రమాదకర అతినీలలోహిత కిరణాలను శోషణం చేసుకొని ప్రాణులకు ప్రయోజనకరమైన సూర్యరశ్మిని భూఉపరితలంపై పడేలా పనిచేయడంతో మానవాళితో పాటు సకల జీవకోటి కూడా పరిరక్షించబడుటకు సదవకాశం లభించింది. ఆధునిక శాస్త్రసాంకేతిక ప్రగతి పరుగుల్లో మునిగి తేలుతున్న నవ్య మానవాళి స్వల్పకాలిక ప్రయోజనాల వలలో చిక్కి అనాలోచితంగా/స్వార్థపూరితంగా చేపట్టిన కార్యాలతో ఓజోన్ పొర క్రమంగా తరుగుతున్నట్లు 1970ల్లోనే శాస్త్రజ్ఞులు గమనించారు. ఓజోన్ పొర తరిగితే ప్రాణికోటి ఆరోగ్యకర మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని తెలుసుకోవాలి. సూర్యరశ్మి లేకుండా జీవరాసుల మనుగడ ఉండదు. కాని సూర్యకాంతిలోని అతినీలలోహిత కిరణాలు భూమిని చేరితే వృక్షజంతు జీవులు పలు తీవ్ర అనారోగ్యాల బారినపడి మనుగడ సాగించడం కష్టం అవుతుంది. త్రిపరమాణుక ఆక్సీజన్ అణువును (03) ఓజోన్ అంటాం.

ఓజోన్ పొర తరగడానికి కారణమైన రసాయనాలు:

ద్విపరమాణుక ఆక్సీజన్ అణువు (02) ప్రాణవాయువుగా ఉపయోగపడుతున్నది. నవజాత ఆక్సీజన్ పరమాణువుకు (0) స్వయం ప్రతిపత్తి, మనుగడ ఉండదని తెలుసుకోవాలి. ద్విపరమాణుక ఆక్సీజన్ (02), త్రిపరమాణుక ఓజోన్ (03)లను విభిన్న ఆక్సీజన్ రూపాంతరాలుగా గుర్తించాలి. ఓజోన్ పొర పలుచబడటానికి దాదాపు 100కు పైగా మానవ నిర్మిత రసాయనాలు కారణమని నిపుణులు తేల్చారు. కార్బన్ పరమాణువులతో ఫ్లోరిన్, క్లోరిన్, బ్రోమిన్, ఐయోడిన్ పరమాణువులు కలిసినపుడు ఏర్పడే రసాయనాలను హాలో కార్బన్స్ అంటాం. హాలో కార్బన్లకు ఓజోన్ పొరను తగ్గించే ధర్మం ఉంటుంది. మిథైల్ బ్రోమైడ్, మిథైల్ క్లోరోఫామ్, కార్బన్ టెట్రాక్లోరైడ్, హాలోన్స్, క్లోరోఫ్లోరో కార్బన్లు (సియఫ్‌సిలు), హైడ్రోక్లోరోఫ్లోరోకార్బన్లు (హెచ్‌సియఫ్‌సిలు) మె?దలగు పలు మ్యాన్-మేడ్ రసాయనాల వల్ల ఓజోన్ పొరకు ప్రమాదం ఏర్పడుతున్నది. రిఫ్రిజిరేషన్, ఏయిర్ కండీషనర్లు, ద్రావణులు, ప్రొపెల్లెంట్స్, ఫోమ్-బ్లోయింగ్ ఏజంట్ల తయారీలో వాడబడే రసాయనాలతో ఓజోన్ పొర పలుచబడటంతో పాటు కొన్ని ప్రాంతాల్లో చిల్లులు (ఓజోన్ హోల్) పడ్డట్లు గమనించారు. ఓజోన్ పొర పలుచబడినపుడు అతినీలలోహిత కిరణాలు భూమిపై చేరి మానవాళికే కాకుండా జంతువులకు చర్మ కాన్సర్, కాటరాక్ట్ లాంటి పలు అనారోగ్యాలు కలుగుతాయి. ఈ ప్రమాదకర కిరణాలు హరిత క్షేత్రాలపై పడినపుడు పంటలకు హాని, పర్యావరణానికి ప్రమాదం ఏర్పడుతుంది.

### ఓజోన్ పొర పరిరక్షణ ప్రపంచ దేశాల ప్రతినలు:

ఓజోన్ పొర పరిరక్షణకు అంతర్జాతీయ సమాజం నడుం బిగించాలనే సదుద్దేశంతో 22 మార్చి 1985న 28 దేశాలు 'వియన్నా కన్వెన్షన్' తీర్మానంపై సంతకాలు చేశారు. వియన్నా కన్వెన్షన్ పునాదిగా చేసుకొని 16 సెప్టెంబర్ 1987న ఓజోన్ పొరకు ప్రమాదకరంగా మారిన రసాయనాల ఉత్పత్తిని ప్రణాళికాబద్ధంగా, దశల వారీగా తగ్గించడానికి అంగీకరించిన ప్రపంచదేశాలు 'మాన్‌ట్రేయిల్ ప్రోటోకాల్'ను ఏకగ్రీవంగా ఆమోదించారు. అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు ఓజోన్ పొరకు కారణమైన ప్రమాదకర రసాయనాల వాడకాన్ని క్రమంగా తగ్గించడం ప్రారంభించారు. ఓజోన్ పొర మనుగడకు అత్యంత ప్రమాదకరంగా మారిన సియఫ్‌సిలు, హాలోన్స్ తయారీ, వాడకాన్ని తొలి దశలో తగ్గించుటకు చర్యలు తీసుకుంటున్నారు. రెండవ దశలో హెచ్‌సియఫ్‌సిల వాడకాన్ని తగ్గించడానికి 1992లో నిర్ణయం తీసుకున్నారు. ఓజోన్ గొడుగుకు ప్రమాదకరంగా మారిన రసాయనాలను అభివృద్ధి చెందిన దేశాలు 2030 వరకు, అభివృద్ధి చెందుతున్న దేశాలు 2040 వరకు పూర్తిగా తగ్గించాలనే లక్ష్యం ఏర్పాటు చేశారు. ఈ దిశలో మాన్‌ట్రేయిల్ ప్రోటోకాల్ ప్రగతిని అధ్యయనం చేసి, హెచ్‌సియఫ్‌సిలను తగ్గించాలనే గట్టి సంకల్పాన్ని వ్యక్తం చేశారు. 15 అక్టోబర్ 2016న కిగాలీ, ర్వండాలో జరిగిన సమావేశంలో హెచ్‌యఫ్‌సిలను తగ్గించాలనిఏకగ్రీవంగ అంగీకరించారు. మాన్‌ట్రేయిల్ ఒప్పందం జరిగి మూడున్నర దశాబ్దాలు అవుతున్న వేళ ఓజోన్ పొర పరిరక్షణకు మరింత పట్టుదలతో చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ అంతర్జాతీయ ఒప్పందాలతో 99 శాతం ప్రమాదకర రసాయనాల ఉత్పత్తిని కట్టడి చేయగలగడం హర్షదాయకం. ఇలాగే దేశాలన్నీ కఠిన చర్యలు తీసుకున్నపుడు తరిగిన ఓజోన్ పొర తిరిగి ఏర్పడడం, జీవుల ప్రశాంత మనుగడకు బాటలు పడతాయి.

### అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం:

ఓజోన్ పొర పరిరక్షణకు అంతర్జాతీయ సమాజం నడుబించాలని పిలుపునిచ్చిన మాన్‌ట్రేయల్ ప్రోటోకాల్ 16 సెప్టెంబర్ 1987న తీర్మానించింది. ఈ చారిత్రక నిర్ణయానికి గుర్తుగా 1994లో ఐరాస నిర్ణయం ఆధారంగా ప్రతి ఏట 16 సెప్టెంబర్‌న ప్రపంచ దేశాలు 'అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం' పాటించడం ప్రారంభించారు. 'ఓజోన్‌తోనే జీవితం : 35 ఏండ్ల ఓజోన్ పొర పరిరక్షణ (ఓజోన్ ఫర్ లైఫ్ : 35 ఇయర్స్ ఆఫ్ ఓజోన్ లేయర్ ప్రొటెక్షన్)' నినాదంతో ప్రపంచ దేశాలు ఓజోన్ పొరను పరిరక్షించాల్సిందే. అత్యంత తెలివైన మానవుడు తన గోతిని తానే తవ్వుకోవద్దని, బతికితేనే ప్రగతి అని మరిచి పోవడం, మన నిల్లక్ష్యమే మన మనుగడను ప్రశ్నార్థకం చేస్తుందని గుణపాఠం తెచ్చుకోవాలి. ఎవరు నిలబడిన కొమ్మను వారే నరుక్కోవడం ఆత్మహత్యాసదృశం అవుతుంది. ఓజోన్ పొరను రక్షించుకుంటూ, మనం బతుకుతూ సకల ప్రాణికోటికి జీవితాన్ని ప్రసాదిద్దాం, పర్యావరణానికి పట్టం కడదాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద..

అమరావతి, సెప్టెంబర్ 15: శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం కొనసాగుతుంది. దీంతో అధికారులు గేట్ ను పైకి ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయం నుంచి ఇన్ ఫ్లో 3.20.000 క్యూ సెక్కులు, ఔట్ ఫ్లో 3.51.332 క్యూ సెక్కులు వరద బయటకు వెళ్తున్నది. పూర్తి స్థాయి నీటి నిల్వ 885 అడుగులు కాగా, ప్రస్తుతం నీటి నిల్వ 884.60 అడుగులుగా ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుత సామర్థ్యం 214.80 టీఎంసీలు గా ఉంది. కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

# కొత్త పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలి : ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు



రంగారెడ్డి, సెప్టెంబర్ 15: కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న నూతన పార్లమెంట్ భవనానికి డా.బీఆర్ అంబేద్కర్ పేరుని పెట్టాలని మేడ్చల్ జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షులు, రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు డిమాండ్ చేశారు. గురువారం దళిత సంఘాల ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మల్లంపేట్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి, ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి టిఆర్ఎస్ శ్రేణులు, దళిత సంఘాలు పాలాభిషేకం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నూతన పార్లమెంట్ భవనానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని తీర్మానించారని గుర్తు చేశారు. పార్లమెంట్ కు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరు పెట్టడం వలన ఆయనకు భారత జాతి రుణం తీర్చుకుంటుందని స్పష్టం చేశారు. జిల్లా అంతటా దళిత సంఘాలు ముందుకు వచ్చి పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని అంబేద్కర్ విగ్రహాలకు పాలాభిషేకాలు చేయడం స్వాగతించదగిన అంశమని గుర్తుకు చేశారు.

తెలంగాణ దళిత సోదరుల స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పార్లమెంట్ కు అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ వస్తుందని తద్వారా వారి కల కచ్చితంగా సాకారం అవుతుందని ఆశించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, నిజాంపేట్ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పీఏసీఎస్ చైర్మన్లు, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, తెరాస పార్టీ కమిటీల నేతలు, తెరాస కుటుంబ సభ్యులు, ప్రజలు, దళిత సంఘాలు తదితరులు పాల్గొన్నారు.




# హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధుల ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన గవర్నర్ శ్రీమతి తమిళిసై సౌందర రాజన్

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల నుంచి స్ఫూర్తి పొందాలని యువతకు పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 15: హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధుల ఫోటో ఎగ్జిబిషన్‌ను గవర్నర్ శ్రీమతి తమిళిసై సౌందర రాజన్ ఈ రోజు సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ లో ప్రారంభించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ సెప్టెంబర్ 18 వరకు కొనసాగుతుంది. హైదరాబాద్ విమోచన వారోత్సవాలను సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అధికారికంగా ఏడాది పాటు 2023 సెప్టెంబర్ 17 వరకు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నేపథ్యంలో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ తో కలిసి సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖలు ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసాయి.

ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన అనంతరం మాట్లాడిన గవర్నర్ నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర సమరయోధుల త్యాగాల గురించి తెలుసుకుని స్ఫూర్తి పొందాలని సూచించారు. నిజాం పాలన నుంచి విముక్తి పొందిన హైదరాబాద్ రాష్ట్రానికి సెప్టెంబర్ 17 నిజమైన విమోచన దినం అని గవర్నర్ అన్నారు. పరకాల, బైరంపల్లి సంఘటనలను గవర్నర్ గుర్తు చేశారు. పరకాల ఊచకోతలో 30 మందిని కాల్చి చంపారని అన్నారు. బైరంపల్లి లో రజాకార్లు 90 మందికి పైగా అమాయకులను బావిలోకి తోసి వేశారని గవర్నర్ వివరించారు. హైదరాబాద్ రాష్ట్రానికి విముక్తి కల్పించి రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు ఉక్కు మనిషిగా గుర్తింపు పొందిన అప్పటి హోంమంత్రి సర్దార్ హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఆపరేషన్ పోలో కార్యక్రమాన్ని చేపట్టారని గవర్నర్ తెలిపారు. ఈ నెల 17న హైదరాబాద్‌లో జరుగుతున్న తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలకు ప్రస్తుత హోంమంత్రి శ్రీ అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.

హైదరాబాద్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులపై ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ)ని గవర్నర్ అభినందించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా నేటి యువతకు నాటి స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు, సాగించిన పోరాటాలు తెలుస్తాయని అన్నారు. నిరంకుశ నిజాం కు వ్యతిరేకంగా ఆందోళన చేసిన స్వాతంత్ర్య సమరయోధులు వల్ల నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి), సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి) డైరెక్టర్ జనరల్ (సౌత్) శ్రీ ఎస్.వెంకటేశ్వర్ అప్పటి హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో స్వాతంత్ర సమరయోధులు పోషించిన పాత్ర గుర్తుకు తెచ్చేలా ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని వివరించారు. కొమరం భీమ్, చాకలి ఐలమ్మ, వందేమాతరం రామచంద్రరావు, భాగ్యరెడ్డి వర్మ, సురవరం ప్రతాపరెడ్డి వంటి స్వాతంత్ర్య సమరయోధులు సాగించిన పోరాటాన్ని వివరిస్తూ మొత్తం 60 ఫోటోలను ప్రదర్శనకు ఉంచారు.

అంతకుముందు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ రమణారెడ్డిని, నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులను గవర్నర్ సన్మానించారు. సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి ఉమా నందూరి మాట్లాడారు.

వేదిక వద్ద పబ్లికేషన్స్ విభాగం ఒక పుస్తక ప్రదర్శన మరియు లలిత కళా అకాడమీ స్వాతంత్ర్య ఉద్యమాన్ని చిత్రించే పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసింది.

# ఈ నెల 16 నుండి తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలు.



సంగారెడ్డి, ఆసెప్టెంబర్ 15: (నేటినిజం ప్రతినిధి): ఈ నెల 16 నుండి 18 వరకు నిర్వహించనున్న "తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను జిల్లాలో విజయ వంతం చేయడంలో అధికారులం దరూ సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారులకు సూచించారు.

బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో "తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాల" ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు .

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాల" ఏర్పాట్లను ప్రణాళికతో పూర్తి చేయాలన్నారు . జిల్లా స్థాయిలో, నియోజవర్గ స్థాయిలో మూడు రోజుల పాటు జరిగే వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని , ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదన్నారు.

16న ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాలు, అన్ని వర్గాల ప్రజల సమన్వయంతో భారీ ర్యాలీ నిర్వహించాలని తెలిపారు.

నియోజకవర్గ ప్రత్యేక అధికారులు జాతీయ సమైక్యత వజ్రోత్సవాలకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను ప్రణాళికతో పూర్తిచేయాలని తెలిపారు. 17న జిల్లా కేంద్రంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే రోజున జిల్లాలో గల ఎస్. టి. అధికారులు, సిబ్బంది, ఎస్.టి. వర్గాల ప్రజలు, హైదరాబాద్ కు తరలి వెల్లెందుకు అవసరమైన వాహానాలను, తాగునీరు, భోజన వసతి కల్పించాలని అందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు.

18న సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జాతీయ సమైక్యత వజ్రోత్సవాల లో అందరు భాగస్వాములై వజ్రోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి , జిల్లా అధికారులు డి ఆర్ డి ఓ, జెడ్ పి సి ఈ ఓ,డి పి ఓ,ఆర్ టి సి ఆర్ ఎం, తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ పై నుండి పడి యువతి మృతి-దర్యాప్తు చేపట్టిన పోలీసులు



అమరావతి, సెప్టెంబర్ 15: లేడీస్ హాస్టల్ పై నుండి ప్రమాదవశాత్తు జారీ పడి రేవతి అనే యువతీ మృతి చెందింది. ఆమె వయసు 25సంవత్సరాలు. ఈ సంఘటన గుంటూరు అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. యువతీ మృత దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పోలీసులు. అరండల్ పేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. కనీసం భద్రత చర్యలు లేకుండా హాస్టల్ నిర్వహిస్తున్నారని సమాచారం. దాదాపు 20 గదులలో 100మందికి పైగా విద్యార్థులు హాస్టల్ లో ఉన్నట్లు సమాచారం.

# టిడిపి సభ్యులను సస్పెండ్ చేయకపోతే సభ సజావుగా సాగదు- మంత్రి అంబటి

అమరావతి, సెప్టెంబర్ 15: నేటి నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. జాబ్ క్యాలెండర్ పై ఇచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలని ప్రతిపక్ష పార్టీ టిడిపి పట్టుపట్టింది. ప్రశ్నోత్తరాల సమయం తరువాత మాట్లాడుతామని స్పీకర్ ప్రకటించారు. అయినా వినకుండా జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ గా మారింది అంటూ టిడిపి సభ్యులు సభలో నినాదాలు చేశారు. స్పీకర్ క్వశ్చన్ అవర్ తర్వాత మాట్లాడుదామని ఎన్నిసార్లు చెప్పినా.. టిడిపి సభ్యులు వినలేదు. స్పీకర్ పోడియం పైకి ఎక్కి వాగ్వాదానికి దిగడంతో సభ పది నిమిషాల పాటు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన తర్వాత మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలను అడ్డుకునేందుకు టిడిపి నేతలు యత్నిస్తున్నారని విమర్శించారు. టిడిపి సభ్యుల తీరు చూస్తుంటే సస్పెండ్ కావాలని కోరుకుంటున్నట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తమ ప్రశ్నలకు కూడా సమాధానం వినే ఉద్దేశం లేదని.. వీరిని సస్పెండ్ చేయకపోతే సజావుగా సాగే పరిస్థితి లేదన్నారు.

# భక్తుల భాగస్వామ్యంతోనే శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు : టీటీడీ ఈవో



తిరుమల, సెప్టెంబర్ 15: టీటీడీలోని అన్ని విభాగాలు సెప్టెంబర్ 27 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలో గురువారం టీటీడీ సీవీఎస్వో నరసింహ కిషోర్‌తో కలిసి నాలుగు మాడ వీధుల్లోని వివిధ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను, గ్యాలరీలను పరిశీలించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ, టీటీడీ శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది పెరటాసి మాసం మరియు అక్టోబరు 1న గరుడ సేవతో పాటు అన్ని వాహన సేవలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

"గత రెండు సంవత్సరాలు, కోవిడ్ మహమ్మారి ఆంక్షల కారణంగా ఆలయం లోపల ఏకాంతంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించినట్లు చెప్పారు. అధిక సంఖ్యలో బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులందరికీ స్వామివారి వాహన సేవ వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని" సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. "బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు, టీటీడీ విజిలెన్స్, జిల్లా కలెక్టర్, పోలీసులు ఇప్పటికే ఇంజనీరింగ్ విభాగంతో కలిసి నాలుగు మాడ వీధులు, గ్యాలరీలను రెండుసార్లు తనిఖీ చేశారన్నారు. ఈ రోజు తనిఖీ సందర్భంగా, తాను కూడా అన్ని ప్రాంతాలను పరిశీలించినట్లు చెప్పారు. ముఖ్యంగా గరుడ సేవ రోజున రాగి మాను ప్రాంతంలో భక్తులను ఉంచడానికి బఫర్ జోన్‌గా ఎలా ఉంచాలనే దానిపై పరిశీలించినట్లు " ఆయన తెలిపారు. ఈ సంవత్సరం, భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఓపికతో వేచి ఉండి దర్శనం చేసుకోవాలని ఈవో విజ్ఞప్తి చేశారు. ఎస్ఈ 2 జగదీశ్వర్‌రెడ్డి, విజివోలు బాలిరెడ్డి, మనోహర్, ఇంజినీరింగ్ అధికారులు, ఏవీఎస్‌వోలు, వీఐలు, తిరుమల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఐదురోజులు ఏపీ అసెంబ్లీ సమావేశాలు-17 అంశాలపై చర్చించేందుకు టీడీపీకి అనుమతి



తిరుమల, సెప్టెంబర్ 15: స్పీకర్ తమ్మినేని సీతారాం అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో సీఎం జగన్..మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జోగి రమేష్.. చీఫ్ విఫ్ శ్రీకాంత్‌రెడ్డి, విప్ ప్రసాద్‌రాజులు పాల్గొన్నారు. టీడీపీ నుంచి అచ్చెన్నాయుడు బీఏసీ సమావేశానికి హాజరయ్యారు. టీడీపీ ప్రస్తావించిన 17 అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం ఓకే చెప్పింది. ఐదురోజులు ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే ఈ మధ్యకాలంలో కన్నుమూసిన సభ్యులకు ఏపీ అసెంబ్లీ సంతాపం తెలిపింది. మాజీ ఎమ్మెల్యే శత్రుచర్ల చంద్ర శేఖరరాజు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, పులపర్తి నారాయణమూర్తి, జేఆర్ పుష్పరాజ్, నల్లమిల్లి మూలారెడ్డి మృతి పట్ల సభ్యులు సంతాపం ప్రకటించారు. స్పీకర్ తమ్మినేని సీతారాం సంతాప తీర్మానాన్ని చదివి వినిపించారు.

# అక్టోబరు 5 నుంచి పవన్ బస్సు యాత్ర-భిన్నంగా తయారీ

అమరావతి, సెప్టెంబర్ 15: బస్సుయాత్రని ప్రారంభించనున్నారు పవర్ స్టార్ ..జనసేన అధినేత పవన్ కల్యాణ్ . ఈ యాత్ర కోసం పవన్ కల్యాణ్ వినియోగించే బస్సును ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ బస్సు పనులు చకచకా సాగుతున్నాయి. సెప్టెంబరు 26 నాటికి బస్సు పనులు పూర్తవుతాయని తెలుస్తోంది. ఓ వర్క్ షాపులో ఈ బస్సు పనులు జరుగుతున్నాయి. లోపలి భాగంలోనూ పవన్ బస చేసేందుకు అనేక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. దూరంగా ఉన్నవారికి సైతం పవన్ కనిపించేలా ఈ బస్సు టాప్ ను తీర్చిదిద్దుతున్నారు. సౌండ్ సిస్టమ్ ను సైతం ఈ బస్సుకే అటాచ్ చేయనున్నారు. ఇప్పటివరకు వివిధ నేతలు రాజకీయ యాత్రలకు ఉపయోగించిన బస్సులతో పోల్చితే ఇది భిన్నంగా కనిపిస్తుంది. నాడు ఎన్టీఆర్ వినియోగించిన చైతన్యరథానికి ఇది దగ్గరగా ఉంది. పవన్ బస్సుకు రెగ్యులర్ సైజు టైర్లు అమర్చారు.

# ఇటీవలే మృతి చెందిన పలువురి కుటుంబాలను పరామర్శించిన మంత్రి పువ్వాడ



ఖమ్మం, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం కార్పొరేషన్ 22వ డివిజన్ కార్పొరేటర్ పల్లా రోజ్ లీనా భర్త సల్మాన్ రాజు, పల్లా జాన్ రాములు సతీమణి పల్లా శాంతమ్మ మృతి పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు.

గురువారం వారి నివాసాలకు వెళ్లి కార్పొరేట్ రోజ్ లీనా ని, శాంతమ్మ కుమారులు పల్లా కిరణ్, పల్లా రాజశేఖర్ లను కలిసి పరామర్శించారు.

సల్మాన్ రాజ్, శాంతమ్మ చిత్రపటానికి పూలామాలవేసి ఘన నివాళులు అర్పించారు. వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# బిల్డ్ నెక్స్ట్ హోమ్స్ మొబైల్ యాప్ ప్రారంభించిన బిల్డ్ నెక్స్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 15: దేశంలో తమ కలల ఇంటిని నిర్మించాలనుకునే వారి కోసం సరికొత్త మొబైల్ యాప్ బిల్డ్ నెక్స్ట్ హోమ్స్ ను ప్రముఖ టెక్-ఎనేబుల్డ్ హోమ్ బిల్డర్ బిల్డ్ నెక్స్ట్ ప్రారంభించింది. ఈ యాప్ ఇప్పుడు యాపిల్ యాప్ స్టోర్ లేదా గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఉచితంగా డౌన్ లోడ్ చేసుకోవడానికి అందుబాటులో ఉంది.

డిజైన్, ఉత్పత్తి ఎంపిక, ప్రణాళిక, రోజువారీ పని పురోగతిని ట్రాకింగ్ చేయడం ద్వారా ప్రాజెక్ట్ హ్యాండ్ఓవర్, మద్దతు ద్వారా ఇంటి ఆలోచన నుంచి ప్రయాణంలో ఈ యాప్ తప్పనిసరిగా కలిగి ఉండాలి. యాప్ ప్రతీ ఇంటి నిర్మాణంపై చాలా ఉపయోగకరమైన మరియు సంబంధిత సమాచారాన్ని అందిస్తుంది, అలాగే బిల్డ్ నెక్స్ట్ హోమ్స్ పై ప్రత్యేకమైన ఆఫర్లను అందిస్తుంది.

బిల్డ్ నెక్స్ట్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ దిలీప్ మాట్లాడుతూ.. తమ యాప్ ఇప్పుడు బిల్డ్ నెక్స్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లలో కనెక్ట్ చేయబడిన, ఇంటిగ్రేటెడ్ హోమ్ కస్టమైజేషన్ అనుభవాన్ని కూడా ప్రారంభిస్తుందని తెలిపారు. వినియోగదారులు యాప్ లో మూడ్ బోర్డ్‌లు, తమ ఆర్కిటెక్ట్‌లచే నిర్వహించబడిన ఉత్పత్తులను స్కాన్ చేయవచ్చు అని చెప్పారు. అలాగే వీఆర్ ట్రయల్ రూమ్‌లలో దానిని లీనమయ్యేలా చూడవచ్చు అని... తమ పేటెంట్ టెక్నాలజీని ఉపయోగించి వారి ఎంపికల ధర ప్రభావాన్ని తక్షణమే తెలుసుకోవచ్చు అని వివరించారు.

బిల్డ్‌నెక్స్ట్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ గోపీ కృష్ణన్ మాట్లాడుతూ.. పోస్ట్ నిధులను స్వీకరించిన తర్వాత తమ మొదటి లక్ష్యం గత సంవత్సరంలో మేము అందుకున్న కొత్త అభ్యాసాలతో యాప్‌ను అప్‌గ్రేడ్ చేయడం అన్నారు. ఇది ఒక ముఖ్యమైన పెట్టుబడి అని, ఇప్పుడు ప్రతీ భారతీయుడు బిల్డ్‌నెక్స్ట్‌లో తమ కలల ఇంటిని నిర్మించుకోవడం సాధ్యమవుతుందని చెప్పారు.

# దశదిన కర్మకు హాజరైన మాజీ ఎంపీ పొంగులేటి

**- చంద్రుగొండ మండలంలో పర్యటించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి) :పొంగులేటి బంధువు చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం గ్రామంకు చెందిన కొల్లు పకీరా రెడ్డి ఇటీవల మృతిచెందారు. గురువారం ఆయన దశదినకర్మకు ఖమ్మం మాజీ ఎంపీ, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతులు హాజరయ్యారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని చిత్రపటానికి పూలు వేసి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పర్యటనలో పొంగులేటి వెంట కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, జిల్లా టీఆర్ఎస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ సున్నం లలిత, భోజ్యానాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, పసుపులేటి వెంకట్, సారేపల్లి శేఖర్, భోజ్యానాయక్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, చెవుల చందర్ రావు, వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, ఇమ్మినేని కోటేశ్వరరావు, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దారావత్ రాంబాబు, భూపతి శ్రీనివాసరావు, గుగులోత్ రాములు, తదితరులు ఉన్నారు.

# నెర్జియన్ గ్రూవ్‌హోను ప్రవేశపెట్టిన క్రాంప్టన్ కరెంటు బిల్లుపై 60% దాకా ఆదా



హైదరాబాద్, సెప్టెంబర్ 15: క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ తన తాజా శక్తి సామర్థ్యపూరిత సీలింగ్ ఫ్యాన్ శ్రేణి ఎనెర్జియన్ గ్రూవ్ ను ప్రవేశపెట్టింది. శక్తి సామర్థ్యంలో అత్యంత అనుభవం కలిగిన బ్రాండ్లలో ఒకటి అని సచిన్ పర్టియల్ పేర్కొన్నారు. , నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డును వరుసగా 6 సార్లు గెలిచిన క్రాంప్టన్ సంపూర్ణ మన్నిక, నాణ్యత హామీతో 80 ఏళ్లకు పైగా చరిత్రను కలిగిఉందని ఆయన అన్నారు. . దీని సరికొత్త 5 స్టార్ రేటెడ్ ఫ్యాన్ యాక్టివ్ బీఎల్డీసీ మోటార్ తో శక్తివంతమైంది. 220 సిఎంఎం గాలిని అందించేందుకు వాగ్దానం చేస్తుంది. 70వి కు బదులుగా 28వి విద్యుత్ ను మాత్రమే ఉపయోగిస్తుందని తెలిపారు. తద్వారా 60% ఆదాతో, ప్రామాణిక ఇండక్షన్ ఫ్యాన్ తో పోలిస్తే కరెంట్ బిల్లుపై (నాలుగు ఫ్యాన్లకు కలిపి) ఏటా రూ.7000 దాకా ఆదాను అందిస్తుంది. మీ ఫ్యాన్ వేగం, గాలి ప్రవాహంతో రాజీ పడకుండానే, క్రాంప్టన్ ఎనర్జియన్ అందమైన డిజైన్లలో కూడా లభ్యమవుతుంది. రిమోట్ కంట్రోల్, యాంటీ డస్ట్ టెక్నాలజీ కలిగి ఉందని సచిన్ అన్నారు. నేడు వినియోగదారులు తమ ఇళ్లలో గణనీయ మార్పులు తీసుకురాగల వాటి కోసం, అదే సమయంలో పర్యావరణానికి స్నేహపూర్వకంగా ఉండే సుస్థిరదాయక, సామాజిక స్పృహ కలిగిన ఎంపికల కోసం చూస్తున్నారు. అయితే, కొన్ని సందర్భాల్లో వారు తమ పర్యావరణ స్నేహపూర్వక ఉపకరణాల విషయానికి వస్తే నిరాశను ఎదుర్కోవాల్సి వస్తోంది. మరీ ముఖ్యంగా శక్తిసామర్థ్యపూర్వక సీలింగ్ ఫ్యాన్ల విషయానికి వస్తే, గాలి తక్కువగా రావడం, సౌలభ్యం లేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొన్నారు. దీన్ని గుర్తించిన క్రాంప్టన్ శక్తి సామర్థ్య పూరిత వినూత్నతలను నూతన శిఖరాలకు తీసుకెళ్లింది.

# తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు.... !

**-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్.**

సంగారెడ్డి, సెప్టెంబర్ 15 (నేటి నిజం ప్రతినిధి) తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్.



తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను జిల్లాల్లో విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ జిల్లాల కలెక్టర్లకు సూచించారుసూచించారు.

బుధవారం హైదరాబాద్ నుండి సిఎస్, రాష్ట్ర ఉన్నత అధికారులతో కలిసి మూడు రోజుల పాటు నిర్వహించు తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సి.ఎస్. మాట్లాడుతూ, తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను జిల్లాలో సెప్టెంబర్ 16 నుంచి 18 వరకు కట్టుదిట్టంగా నిర్వహించాలని, 16న ప్రతి నియోజకవర్గంలో నిర్వహించే ర్యాలీ రూట్ మ్యాప్ తయారు చేసుకోవాలన్నారు.

నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల సహకారంతో భారీ ర్యాలీ, సమావేశం నిర్వహించాలని తెలిపారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరవుతున్న నేపథ్యంలో భోజనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, అధిక సంఖ్యలో కౌంటర్లను మండలాల వారీగా ఏర్పాటు చేయాలని సూచించారు.

17న జిల్లా కేంద్రాల్లో ముఖ్య అతిథిచే జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని, హైదరాబాద్ లో జరిగే ఆదివాసీ భవన్ ,బంజారా భవన్ ప్రారంభానికి జిల్లా కు కేటాయించిన లక్ష్యాల మేరకు ఎస్టీలను తరలించాలని, బస్సు,భోజన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

సెప్టెంబర్ 18న జిల్లా కేంద్రాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రముఖ కళాకారులను, స్వాతంత్ర సమరయోధులకు సన్మానం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన భవనాలకు ట్రై కలర్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ సమైక్యత దినోత్సవం ఘనంగా నిర్వహించడానికి అన్ని రకాల పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు, 16న జిల్లాలో ఉన్న 5 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసామని, స్థానిక ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకొని ర్యాలీ విజయవంతం చేస్తామని తెలిపారు.

ర్యాలీ అనంతరం భోజనం ఏర్పాట్ల కోసం అవసరమైన అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు ఎలాంటి పొరపాట్లు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి,డి ఆర్ ఓ,జిల్లా అధికారులు, ఆర్టిసి ఆర్ ఎం, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సమైక్యత వజ్రోత్సవాల వేడుకలు వైభవంగా నిర్వహించాలి

**-నేడు వేములవాడలో వేడుకలకు హాజరు కానున్న మంత్రికేటీఆర్**

**-శాసనసభ్యులు చెన్నమనేని రమేష్.**

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): ఈ నెల 16,17,18 తేదీ లీలలు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనున్న తెలంగాణ సమైక్య త వజ్రోత్సవాల వేడుకలు విజయవంతానికి ప్రజాప్రతినిధులు ,అధికార యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు అన్నారు



ఈ సందర్భంగా శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు వేములవాడ పట్టణంలోని గుడి చెరువు ప్రాంగణంలో నేడు శుక్రవారం జరగబోయే తెలంగాణా సమైక్యతా వజ్రోత్సవాల వేడుకల బహిరంగ సభకు మంత్రి కేటీఆర్ రానున్న సందర్భంగా బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే రమేశ్ బాబు పరిశీలించారు ఎమ్మెల్యే అనంతరం ఎం.ఎల్.ఏ రమేష్ మాట్లాడుతూ నైజాం నుండి విముక్తి పొందిన హైదరాబాద్ సంస్థానం భారతావనిలో విలీనమైన సందర్భంగా సాయుధ పోరాట యోధులను స్మరించుకుంటూ 3 రోజుల పాటు జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న సందర్భంలో రేపటి బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన సందర్భంగా వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయవలసిందిగా వారికి పలు సలహాలు, సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో జెడ్.పి చైర్మన్ న్యాలకొండ అరుణ , మున్సిపల్ చైర్మన్ రామతీర్థం మాధవి , మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమాండ్లు, జెడ్.పి.టి.సీలు, ఎం.పి.పిలు, ఎం.పీ.టీ.సీలు, సర్పంచులు, పాక్స్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సమగ్రాభివృద్ధికి అభివృద్దే ధ్యేయంగా పని చేస్తున్నాం..మంత్రి పువ్వాడ

**- రూ.90 లక్షలతో సిసి డ్రైన్ల పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పువ్వాడ**

**- ఆసరా పెన్షన్స్ ఆర్డర్స్ & గుర్తింపు కార్డ్స్ పంపిణి**

ఖమ్మం, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): అన్ని వర్గాల పేద ప్రజల సమగ్రాభివృద్దే ధ్యేయంగా తెరాస ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.



ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ లో రూ.45 లక్షలు, 15వ డివిజన్ లో రూ.45 లక్షలు మొత్తం రూ.90 లక్షలతో నిర్మించనున్న సైడ్ డ్రైన్స్ నిర్మాణ పనులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంజూరైన పెన్షన్ ఆర్డర్స్ & గుర్తింపు కార్డ్స్ ను పంపిణి చేశారు.

అల్లిపురంలో అత్యద్భుతంగా విశాలమైన వైకుంఠధామం నిర్మాణం జరుగుతుందని, లో-ఓల్టేజ్ నివారణ కోసం సబ్ స్టేషన్ మంజూరు చేశామని, ప్రస్తుతం నిర్మాణంలో ఉందని అతి త్వరలో వాడుకలోకి తెస్తామన్నారు.

స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని, రానున్న రోజుల్లో ఒక్క మట్టి రోడ్డు, సైడ్ కాల్వల రహిత డివిజన్లు గా మార్చి చూపిస్తామని అన్నారు.

ప్రజా అవసరాల కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని, ఒకప్పుడు వీధులకు ఒక్క రోడ్డు రావడం చాలా గొప్ప విషయమని, కానీ తెరాస ప్రభుత్వంలో కోట్ల రూపాయలు అభివృద్ధి, సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నామని వివరించారు.

తెలంగాణ వచ్చాక దాదాపు రూ.300 కోట్ల రూపయలతో ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగు నీరు ఇస్తున్నామన్నారు.

సుడా నిధులతో కార్పోరేషన్ మొత్తం ప్రతి డివిజన్ కు రూ.20 లక్షలు చొప్పున 60 డివిజన్ లలో మొత్తం రూ.12 కోట్లతో ప్రతి డివిజన్ కు వీడిఎఫ్ రోడ్స్ ను వేస్తామన్నారు.

కాంగ్రెస్ హయాంలో రూ.200 పెన్షన్ వచ్చేదని దాన్ని నేడు ప్రభుత్వం రూ.2వేలు, రూ.3వేలు ఇస్తున్నారని అన్నారు. వారితో పాటు బీడీ కార్మికులు, బోదకాలు వారికి, డయాలిసిస్ రోగులకు కూడా పెన్షన్ లు ఇస్తున్నామని అన్నారు.

తెలంగాణలో దాదాపు కోటి ఐదు లక్షల కుటుంబాలు ఉంటే వారిలో దాదాపు 46 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నామని అన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇవ్వాలని ఎమ్మెల్యేగా గెలిచిన తొలి నాళ్ళలో అర్హులైన వారికి పెన్షన్ ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి అదనంగా వేల పెన్షన్ లు ఇచ్చామన్నారు.

పేదలకు ప్రభుత్వ నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అందరికి అందుబాటులో ఉండే విధంగా బస్తీ దవాఖానలు ఎర్పాటు చేయగా వాటిని ఖమ్మం లో ఎర్పాటు చేస్తున్నామని వాటిని ప్రజలు సద్వినియోగించు కావాలని అన్నారు.

అతి త్వరలో ఖమ్మం నియోజకవర్గంలో 500 మందికి దళిత బంధు పథకాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. స్వయంగా తమ కాళ్ళ మీద తాము నిలబడే విధంగా సొంతంగా వ్యాపారాలు చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా, కార్పొరేటర్ లు రావూరి కరుణ, కూరకుల వలరాజ్, చామకురి వెంకన్న, జ్యోతి రెడ్డి, సుడా చైర్మన్ విజయ్, మున్సిపల్ డిఈ ధరణి, తదితరులు ఉన్నారు.

# పాఠశాల అభివృద్ధికి రూ.25000 అందజేసిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా

హైదరాబాద్, సెప్టెంబర్ 15: ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం ఉప్పల్ మండలం కొత్తపేట గ్రామంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కొరకై 25,000 రూపాయలను నాగోల్ లోని తన కార్యాలయంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, స్కూల్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కూర నాగరాజు, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర పొలిటికల్ కమిటీ చైర్మన్, బచ్చు శ్రీనివాస్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా ట్రెజరర్ చింతల రజినీకాంత్, వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# నులి పురుగుల మందు పంపిణి చేసిన మంత్రి పువ్వాడ



ఖమ్మం, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): పిల్లల్లో అనారోగ్యానికి కారణమయ్యే నులి పురుగుల నివారణకు 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు ప్రతి ఒక్కరు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

గురువారం ఖమ్మం రిక్కా బజార్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన నులి పురుగుల మందులను విద్యార్థులకు మంత్రి పువ్వాడ పంపిణీ చేశారు.

మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా రిక్కా బజార్ ప్రభుత్వ పాఠశాలకు రూ.50లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులకు పంపిణీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు.

కడుపులో నులి పురుగులు వృద్ధి చెందితే పిల్లలు అనారోగ్యానికి గురవుతారని, ఆహారం, మురుగు చేతుల ద్వారా లార్వా చర్మం లోపలికి చొచ్చుకుపోవడం వల్ల వీటి సంక్రమణకు గురవుతారని విద్యార్థులు శుభ్రతను తప్పక పాటించాలన్నారు.

నులి పురుగులు ఉన్న పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, బలహీనత, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి పేర్కొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలతో ఎంతో ఉపయోగం ఉంటుందని, ఇతర జబ్బులకు మందులు వాడే పిల్లలు ఈ మాత్రలు వేసుకోవద్దని వైద్యులు సూచిస్తున్నారని వివరించారు.

అనంతరం మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, డిఎంఅండ్‌హెచ్వో మాలతీ, సుడా చైర్మన్ విజయ్, కార్పొరేటర్ విజయ, తదితరులు ఉన్నారు.

# నాణ్యమైన భోజనం అందించాలి: పోచారం శ్రీనివాస రెడ్డి



నిజామాబాద్, సెప్టెంబర్ 15: కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి అకస్మీకంగా తనిఖీ చేసి ఉదయం వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. మెను ప్రకారం పప్పు దినుసులు, మసాలాలను వంటలలో వాడి నాణ్యమైన, రుచికరమైన భోజనం వండారా అని వార్డెన్, సిబ్బందిని ప్రశ్నించారు. స్టోర్ రూంలో సరుకులను పరిశీలించి, అనంతరం విద్యార్థులతో కలిసి టిఫిన్ చేసారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం మాట్లాడుతూ.. వసతి గృహాలలో లోపాలను సవరించడానికే అకస్మీక తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు అందరూ పేదరికం నుండి వచ్చిన వారే అని, మన పిల్లలు ఎంతో వారు కూడా అంతే అన్నారు. మంచి భోజనం పెట్టడం మన బాధ్యత, హాస్టళ్ల నిర్వాహణకు ప్రభుత్వమే కావలసిన నిధులను మంజూరు ఇస్తుందన్నారు. చిన్నప్పటి నుండి పిల్లలకు పౌష్టికాహారం అందిస్తే పిల్లలు శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వ వసతి గృహాలలో మెరుగైన వసతులకు, పరిశుభ్రతకు స్పెషల్ డెవలప్మెంట్ నిధులు కెటాయించడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు చాలీచాలని మెస్ చార్జీలతో పిల్లలకు సరిగ్గా ఆహారం అందించలేని పరిస్థితి, కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ హాస్టళ్లలో పిల్లలకు కడుపు నిండా తిన్నంత భోజనం అందే విదంగా మెస్ చార్జీలను భారీగా పెంచారని గుర్తు చేశారు. నాణ్యమైన సరుకులు, కూరగాయలను కొనుగోలు చేసి రుచికరమైన ఆహారాన్ని వండాలి, ఆహారం వండేటప్పుడు, పిల్లలకు వడ్డిస్తున్న సమయంలో వార్డెన్లు ఖచ్చితంగా హాస్టల్ లో ఉండాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

# సచివాలయానికి అంబేద్కర్ పేరు ప్రకటించడం పట్ల కెసిఆర్ కి కృతజ్ఞతలు

**- తెరాస జిల్లా నాయకులు బాదావత్ లక్ష్మణ్ నాయక్**



ఖమ్మం, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ నూతన సచివాలయానికి ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా.బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి కెసిఆర్ కి తెలంగాణ ఉద్యమకారుడు, తెరాస ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు బాదావత్ లక్ష్మణ్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కూసుమంచి మండలంలో పాత్రికేయుల సమావేశంలో లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ఇది చారిత్రాత్మక నిర్ణయమని బాబా సాహెబ్ అంబేద్కర్ పట్ల ఉన్న గౌరవాన్ని సీఎం కేసీఆర్ మరోసారి సగర్వంగా చాటుకున్నారని ప్రశంసనీయం. పార్లమెంట్ భవనానికి కూడా అంబేద్కర్ పేరును పెట్టి బిజెపి ప్రభుత్వం తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 3ని అంబేద్కర్ పొందుపరచడం వల్లనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని, అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు సాగుతున్న తెలంగాణ పరిపాలన సముదాయమైన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టాలని సీఎం కెసిఆర్ నిర్ణయించడం తెలంగాణకే గర్వకారణమని తెలిపారు. సీఎం కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం భారతదేశానికి ఆదర్శమని స్పష్టం చేశారు. అంబేద్కర్ స్పూర్తితో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న టిఆర్ఎస్ ప్రభుత్వం మరో చారిత్రక నిర్ణయాన్ని తీసుకుందని చెప్పారు. ఢిల్లీలో నూతనంగా నిర్మిస్తున్న పార్లమెంటు భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని సీఎం కెసిఆర్ చేస్తున్న డిమాండ్ ని, తెలంగాణ అసెంబ్లీ పంపించిన తీర్మానాన్ని బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్వీకరించాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు భవనానికి అంబేద్కర్ పేరు పెడితే భారతదేశం ప్రతిష్ట గౌరవం ప్రపంచవ్యాప్తంగా మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. కాబట్టి పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టి రాజ్యాంగం పట్ల ఉన్న చిత్తశుద్ధిని బిజెపి నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఈ దిశగా తెలంగాణ బిజెపి నేతలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని లక్ష్మణ్ నాయక్ సూచించారు.

# వజ్రోత్సవాలను విజయవంతం చేయాలి-ఈదురు ఐలయ్య



మహబూబాబాద్, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): 16వ తారీకున పాలకుర్తిలో జరిగే తెలంగాణ రాష్ట్ర జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను విజయవంతం చేయాలని పెద్దవంగర మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య తెలిపారు. ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు పెద్ద వంగర టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ పెద్దవంగర మండలంలోని అన్ని గ్రామాల నుండి టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు,స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు,కార్యకర్తలు, యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చి సమైక్యత ర్యాలీని మరియు గౌరవ మంత్రి పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఇట్టి సమావేశంలో పాలకుర్తి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ( పనులు), ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న తీరును బహిరంగ సభలో వివరిస్తారని అన్నారు. తరువాత ముఖ్యమంత్రి సహాయనిధి నుండి (అఓఖీఈ) కార్పొరేట్ హాస్పిటల్లో వైద్యం చేయించుకున్న పేదలకు వైద్య ఖర్చులను మంత్రి సహకారంతో మూడు చెక్కుల మొత్తం 1లక్ష 65 వేల రూపాయలు ఇప్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ధరావత్ అభిమాన్ గాంధీ నాయక్, టిఆర్ఎస్ జిల్లా నాయకులు మారినేని వెంకన్న, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు జాటోత్ నెహ్రూ నాయక్, మండల రైతు కోఆర్డినేటర్ పాకనాటి సోమారెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు పాలకుర్తి యాదగిరి రావు, టిఆర్ఎస్ నాయకులు శ్రీరామ్ సుధీర్ ,ముత్తినేని శ్రీనివాస్, మండల పార్టీ ఉపాధ్యక్షులు భానోత్ వెంకన్న, జనగాం సత్యనారాయణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ సంజయ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యులు ముజీబ్, మండల ,బానోత్ సోమన్న, చిలుక బిక్షపతి,శరబోద్దీన్, ధరవత్ రమేష్,దంతలపెల్లి ఉపేందర్, ధరవత్ బాలు, బానోత్ గోపాల్, దుంపల సమ్మయ్య, పనులేటి వెంకట్రామయ్య,లింగాల రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# నూతన సచివాలయానికి డా.బీఆర్.అంబేద్కర్ పేరు పెట్టడం గర్వకారణం: మంత్రి పువ్వాడ

**- యావత్ దేశానికే మార్గదర్శిగా నిలిచిన తెలంగాణ**

**- వారి స్పూర్తితోనే అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందంజలో నిలిపిన కేసీఆర్**

ఖమ్మం, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయానికి బాబాసాహెబ్ బీ.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టడం యావత్ దేశానికే గర్వకారణమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

సచివాలయం కు అంబేద్కర్ పేరు పెడతామని ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సమాజంలోని ప్రతీ ఒక్కర్నీ సమాన ద్రుష్టితో చూసిన, దళిత, వెనుకబడిన వర్గాల సమానత్వం కోసం పోరాడిన మహనీయుడి పేరును వందలకోట్లతో నిర్మించిన అత్యాధునిక సచివాలయానికి పెట్టడం ద్వారా తెలంగాణ రాష్ట్రం దేశానికకే ఆదర్శంగా నిలిచిందన్నారు.

ఈ చర్యతో వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవం మరింత పెరిగిందన్నారు. ఇదే స్పూర్తితో కేంద్ర ప్రభుత్వం సైతం నూతన పార్లమెంటు భవనానికి బాబా సాహెబ్ అంబేద్కర్ పేరును పెట్టాలని డిమాండ్ చేశారు.

# వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పిస్తాం: నితీశ్ కుమార్

పాట్నా, సెప్టెంబర్ 15: 2024 ఎన్నికల తర్వాత ఒకవేళ బీజేపీయేతర పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, అప్పుడు వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పించనున్నట్లు బీహార్ సీఎం నితీశ్ కుమార్ తెలిపారు. ఒక్క బీహార్‌కు మాత్రమే కాదు, అన్ని వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. ఇటీవల ఢిల్లీకి వెళ్లిన నితీశ్ అక్కడ విపక్ష నేతల్ని కలుసుకున్న విషయం తెలిసిందే.

ఒకవేళ ఏదైన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే, అప్పుడు కేంద్ర పథకాలకు 90:10 శాతంతో నిధులను కేటాయించడం జరుగుతుంది. ఇది ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు దీని ద్వారా లాభం జరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఉంది. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, మణిపూర్, మేఘాలయా, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు స్పెషల్ స్టేటస్ ఉంది.

నేషనల్ డెవలప్మెంట్ కౌన్సిల్ ఆయా రాష్ట్రాలకు ఆ హోదా కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నది. 14వ ఫైనాన్స్ కమిషన్ ప్రతిపాదనలను ఆమోదించిన తర్వాత ప్రత్యేక హోదా సిద్ధాంతాన్ని ప్రభుత్వం పక్కనపెట్టింది.

# జీవ వైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

మహబూబాబాద్, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలంలోని చిన్నవంగర గ్రామంలో ఐటిసి భద్రాచలం వారి సహకారంతో ఎఫెర్ట్ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగంది. ఈ కార్యక్రమానికి మండల రైతు సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ పాకనాటి సోమారెడ్డి, ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లు పెరగడం వల్ల వాతావరణ కాలుష్యం తగ్గి స్వచ్ఛమైన పర్యావరణం, వాతావరణం ఏర్పడితుంది అని అన్నారు. చెట్లు మానవ మనుగడకు దోహద పడుతాయని, అడవులతోనే ప్రకృతి సమతుల్యత సాధ్యమని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య పర్యావరణం పరిరక్షణ అని ఇది ప్రభుత్వం, ఆయా శాఖల బాధ్యత మాత్రమే కాదని, దాని ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజలను భాగస్వామ్యం చేయ్యాలి అని వారు కోరారు. పెట్టిన ప్రతి చెట్టును బతికించాలి,అదే ప్రజల ముందు ఉన్న పెద్ద కర్తవ్యం అని రేపటి తరాలకు ఏదో ఇవ్వాలని అనుకుంటాం కానీ చెట్లు ఇవ్వాలి ఆక్సిజన్ ఇవ్వాలి అని మానవాళి భవిష్యత్ కూడా మొక్కల పెంపకం చాలా కీలకం అని తెలిపారు. అనంతరం ఎఫర్ట్ సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని తెలిపారు. చెట్లు మానవ మనుగడకు దోహదం చేస్తున్నాయని, వర్షాలు బాగా కురువాలంటే చెట్లు,అడవులు పెంచాలని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు చిన్నతనం నుండే మొక్కల యొక్క ప్రాముఖ్యతను తెలుపుతూ పెంచాలని అన్నారు . ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వి రవీందర్, ఈజీఎస్ ఇన్చార్జి ఈసీ భూక్య సురేష్ నాయక్ ,టెక్నికల్ అసిస్టెంట్ సుధగాని యాకయ్య ,గ్రామ కార్యదర్శి జూకంటి గీత, స్థానిక వార్డు మెంబర్లు , ఫీల్డ్ అసిస్టెంట్ బి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



# నాలుగో రోజుకు చేరిన రైతుల మహా పాదయాత్ర



అమరావతి, సెప్టెంబర్ 15: అమరావతిని రాష్ట్ర రాజధానిగా చేయాలంటూ రైతులు చేపట్టిన మహా పాదయాత్ర కొనసాగుతున్నది. రైతుల పాదయాత్ర ఇవాళ నాలుగో రోజుకు చేరింది. గుంటూరు జిల్లాలో యాత్ర కొనసాగుతున్నది. రైతుల పాద యాత్రలో మహిళలు ఉత్సాహంగా పాదం కలిపారు. యాత్ర కొనసాగుతున్న గ్రామాల ప్రజలు, యువత మద్దతుగా నిలిచారు. పాదయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటు చేశారు.

అమరావతి రాజధాని కోసం రైతులు చేపట్టిన మహా పాదయాత్ర ఇవాళ నాలుగో రోజుకు చేరింది. రాజధాని కోసం ఆందోళనలు చేపట్టి వేయి రోజులు పూర్తయిన సందర్భంగా రెండో దశ పాదయాత్రకు రైతులు పూనుకున్నారు. ఇవాళ గుంటూరులోని పెదరావూరు నుంచి వేమూరు మీదుగా కొల్లూరు వరకు పాదయాత్ర సాగింది. మూడు రాజధానులు వద్దని, ఏకైక రాజధాని ముద్దంటూ రైతులు చేసిన నినాదాలు మిన్నంటాయి. పెదరావూరు పరిసర గ్రామాల ప్రజలు ముఖ్యంగా యువత పాద యాత్రకు మద్దతుగా నిలిచారు. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని అమరావతినే రాజధానిగా ఏర్పాటు చేయాలంటూ డిమాండ్ చేశారు. ఉదయం ఏడు గంటల ప్రాంతంలో ప్రారంభమైన ఈ పాదయాత్ర.. మధ్యాహ్నం భోజన విరామ సమయానికి కొంత సేపు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటల వరకు యాత్ర కొనసాగింది. పాదయాత్ర సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. అలాగే, రాజధాని అమరావతి పరిరక్షణ సమితి రక్షణ కోసం బౌన్సర్లను నియమించుకున్నది. బుధవారం తెనాలి ప్రాంతంలో స్వల్ప ఉద్రిక్తత తలెత్తింది. వెంటనే సర్ది చెప్పడంతో రైతులు శాంతించి పాదయాత్రను కొనసాగించారు.

# ఈ నెల 20న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుపతి , సెప్టెంబర్ 15: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 20 న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టనునునారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా ఆలయంలో బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. బ్రేక్ దర్శనాల కోసం ఈ నెల 19 న సిఫారసు లేఖలు స్వీకరించరు. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని టీటీడీ కోరింది.

సాధారణంగా ఏడాదిలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ నెల 27 నుంచి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండటంతో 20 న ఉదయం 6 నుంచి ఉదయం 11 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా కడుగుతారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పుతారు. శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేస్తారు.

అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఆ తర్వాత భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. ఈ కారణంగా మంగళవారం నిర్వహించే అష్టదళ పాద పద్మారాధన సేవను టీటీడీ బోర్డు రద్దు చేసింది.

# జాతీయ సమైక్యతా దినోత్సవ వైభవంగా నిర్వహించాలి

**-నేడు వేములవాడలో వేడుకలకు హాజరు కానున్న మంత్రి కేటీఆర్**

**- శాసనసభ్యులు చెన్నమనేని రమేష్.**



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): ఈ నెల 16,17,18 తేదీ లీలలు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనున్న తెలంగాణ సమైక్య తా దినోత్సవ వేడుకలు విజయవంతానికి ప్రజాప్రతినిధులు ,అధికార యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు అన్నారు

ఈ సందర్భంగా శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు వేములవాడ పట్టణంలోని గుడి చెరువు ప్రాంగణంలో నేడు శుక్రవారం జరగబోయే తెలంగాణా జాతీయ సమైక్యతా దినోత్సవ బహిరంగ సభకు మంత్రి కేటీఆర్ రానున్న సందర్భంగా బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే రమేశ్ బాబు పరిశీలించారు ఎమ్మెల్యే అనంతరం ఎం.ఎల్.ఏ రమేష్ మాట్లాడుతూ నైజాం నుండి విముక్తి పొందిన హైదరాబాద్ సంస్థానం భారతావ నిలో విలీనమైన సందర్భంగా సాయుధ పోరాట యోధులను స్మరించుకుంటూ 3 రోజుల పాటు జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న సందర్భంలో రేపటి బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు. అలాగే నియోజ కవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి న సందర్భంగా వజ్రో త్సవ వేడుకలను విజయవంతం చేయ వలసిందిగా వారికి పలు సలహాలు, సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో జెడ్.పి చైర్మన్ న్యాలకొండ అరుణ , మున్సిపల్ చైర్మన్ రామతీర్థం మాధవి , మాజీ మార్కెట్ చైర్మన్ లోక బాపురెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హను మాండ్లు, జెడ్.పి.టి.సీలు, ఎం.పి. పిలు, ఎం.పీ.టీ.సీలు, సర్పంచులు, పాక్స్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ ఈఓగా ధర్మారెడ్డికి లైన్ క్లియర్.. ఏపీ హైకోర్టు కీలక తీర్పు

అమరావతి, సెప్టెంబర్ 15: ఏవీ ధర్మారెడ్డికి ఏపీ హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. టీటీడీ ఈఓగా ఆయన నియామకాన్ని సమర్థిస్తూ కీలక తీర్పునిచ్చింది. అదనపు ఈఓగా ఉన్న ధర్మారెడ్డిని ఈఓగా నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన రిట్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. టీటీడీ ఈఓగా నియమించేందుకు ఆయనకు అన్ని అర్హతలు ఉన్నాయని కోర్టు తేల్చిచెప్పింది. ఈ పిటిషన్‌ను తిరుపతికి చెందిన నవీన్ కుమార్ రెడ్డి దాఖలు చేసి.. ధర్మారెడ్డిని అదనపు ఈఓగానే కొనసాగించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు.

తిరుపతి తిరుమల దేవస్థానానికి డిప్యుటేషన్‌పై 2019 లో ఏవీ ధర్మారెడ్డి వచ్చారు. ఆయన 1991 లో ఇండియన్ డిఫెన్స్ అండ్ ఎస్టేట్స్ సర్వీస్ గ్రూపు-ఏ సర్వీసుల్లో యూపీఎస్సీ ద్వారా చేరారు. కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాలశాఖ 2019 లో ఆయనను కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు డిప్యుటేషన్‌పై పంపింది. ఈ ఏడాది మే 14 తో ఆ డిప్యుటేషన్ కాలపరిమితి కూడా ముగిసింది. అయినప్పటికీ ఆయనను వెనక్కి పంపకుండా అదనపు ఈఓ స్థాయి నుంచి ఈఓగా పోస్టింగ్ ఇచ్చారు.

కాగా, ఐడీఈఎస్ అధికారి అయిన ధర్మారెడ్డికి జిల్లా కలెక్టర్ స్థాయి అర్హత లేదని, అలాంటప్పుడు ఆయనను టీటీడీ ఈఓగా ఎలా నియమిస్తారంటూ పిటిషన్‌దారు నవీన్ కుమార్‌రెడ్డి కోర్టులో దావా వేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను నిలుపుచేసి ఆ హోదాకు సమానమైన అర్హతలున్న వ్యక్తిని నియమించేలా ఆదేశాలివ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై విచారించిన ఏపీ హైకోర్టు టీటీడీ ఈఓగా నియమించేందుకు కావాల్సిన అర్హతలన్నీ ధర్మారెడ్డికి ఉన్నాయని, ఆయనను ఈఓగా నియమించడంలో ఎలాంటి తప్పిదం జరుగలేదని స్పష్టం చేసింది. దీంతో ఈఓగా ఆయన నియామకానికి ఇప్పటివరకు ఉన్న అడ్డంకులు అన్నీ తొలిగిపోయాయి.

# ఫ్రాన్స్ కు చెందిన విదేశీ వ్యవహారాలు మరియు యూరోప్ శాఖ మంత్రి తో సమావేశమైన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: ఫ్రాన్స్ కు చెందిన విదేశీ వ్యవహారాలు మరియు యూరోప్ శాఖ మంత్రి కేథరీన్ కోలోనా గారు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తో ఈ రోజు న సమావేశమయ్యారు. ఆమె సెప్టెంబర్ 13వ తేదీ మొదలుకొని 15వ తేదీ మధ్య కాలం లో భారతదేశాన్ని ఆధికారికంగా సందర్శించడం కోసం తరలి వచ్చారు. ద్వైపాక్షిక అంశాల ను మరియు పరస్పర హితం ముడిపడిన ఇతర అంశాల ను చర్చించడం తో పాటుగా అధ్యక్షుడు శ్రీ ఇమేన్యుయల్ మేక్రోన్ తరఫు న సహకార పూర్వక మరియు మైత్రి పూర్వక సందేశాన్ని కూడా మంత్రి ఈ సందర్భం లో ప్రధాన మంత్రి కి అందజేశారు. పేరిస్ లో మరియు జర్మనీ లోని శ్లాస్ ఎల్ మావు లో అధ్యక్షుడు శ్రీ ఇమేన్యుయల్ మేక్రోన్ తో ఇటీవల తాను పాల్గొన్న సమావేశాల ను గురించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆప్యాయం గా గుర్తు కు తెచ్చుకొని, వీలైనంత త్వరలో అధ్యక్షుని కి భారతదేశం లో స్వాగతం పలకాలని వుందన్నూటన తన ఆకాంక్ష ను వ్యక్తం చేశారు.

# బీజేపీ చరిత్రను వక్రీకరిస్తున్నది : తమ్మినేని వీరభద్రం



సిద్దిపేట, సెప్టెంబర్ 15: బీజేపీ పార్టీ చరిత్రను వక్రీకరిస్తున్నదని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం మద్దూరు మండలం బైరాన్‌పల్లిలో అమరవీరుల సంక్షేమ సభకు హాజరై ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ.. బీజేపీకి దేశద్రోహ చరిత్ర తప్ప దేశభక్తి లేదని మండిపడ్డారు. స్వాతంత్ర పోరాటం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బీజేపీ పాత్ర శూన్యం అన్నారు.

గాంధీజీని చంపిన చరిత్ర బీజేపీ నాయకులకు ఉందని ఘాటుగా విమర్శించారు. కార్పొరేట్ శక్తుల కొమ్ముకాస్తూ ఆ పార్టీ దేశాన్ని అంధకారంలోకి నెడుతుందన్నారు. సంపన్న వర్గాల మేలు కోసమే బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీ వల్లనే దేశ విభజన జరిగిందని ఆయన ఆరోపించారు. బీజేపీని ఢీకొట్టే దమ్ము టీఆర్ఎస్ పార్టీకే ఉందన్నారు. అందుకే మునుగోడు ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థికే మద్దతు ప్రకటించామన్నారు.

# నూతన పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలి : గద్దర్



హైదరాబాద్, సెప్టెంబర్ 15: నూతనంగా నిర్మించిన పార్లమెంట్ భవనానికి భారత రాజ్యంగ నిర్మాత డా.బీఆర్. అంబేద్కర్ పేరు పెట్టాలని ప్రజా గాయకుడు గద్దర్ అన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి కలిసి వినపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా గద్దర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీపై యుద్ధం చేయడానికి సీఎం కేసీఆర్ వెంట నడవడానికి నేను సైతం సిద్ధం అని ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కాగా, అంబేద్కర్ రాజ్యాంగం వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని సీఎం కేసీఆర్ అసెంబ్లీ వేదికగా మాట్లాడారు.

అలాగే మంత్రి కేటీఆర్ ఇదే అంశంపై తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసినా అంశాన్ని ఎంపీ రంజిత్ రెడ్డి గుర్తు చేశారు. ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంటు భవనానికి అంబేద్కర్ పేరు పెట్టడం సముచితమేనని అన్నారు. ఇదే విషయాన్ని వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తానని వారికి హామీ ఇచ్చారు.

# టీడీపీ అంటే టెంపరరీ డెవలప్‌మెంట్ పార్టీ : మంత్రి బుగ్గన

అమరావతి, సెప్టెంబర్ 15: ఆంధ్రప్రదేశ్ ఆర్థిక , శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి టీడీపీకి కొత్త నిర్వచనం చెప్పారు. టీడీపీ అంటే తెలుగుదేశం పార్టీ కాదని టెంపరరీ డెవలప్‌మెంట్ పార్టీ అని ఎద్దేవా చేశారు. ఏపీ అసెంబ్లీ సమావేశంలో అమరావతి రాజధాని, అధికార వికేంద్రీకరణ అంశంపై స్వల్పకాలిక చర్చలో మంత్రి ప్రసంగించారు. అమరావతి కొంతమంది టీడీపీ నాయకుల స్వార్థం కోసం వెలసిన రాజధాని అని వ్యాఖ్యానించారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారం కోసం రైతుల వద్ద నుంచి భూములు కొనుగులో చేశారని, మొత్తం 30 వేల ఎకరాలకు గాన 10 వేల ఎకరాలు టీడీపీ వారివేనని ఆరోపించారు. అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని పేర్కొన్నారు. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం అధికార వికేంద్రీకరణ జరగాలని స్వయాన శివరామకృష్ణన్ ఇచ్చిన నివే దికలో పేర్కొన్నారని తెలిపారు. అధికార వికేంద్రీకరణ ఒక్క ప్రాంతానికే పరిమితం కాకూడదని అన్ని ప్రాంతా లు విస్తరించాలనే సూచనలతో ప్రభుత్వం మూడు రాజధానులు ఏర్పాటు అంటుందని వెల్లడించారు.

# తెలంగాణ సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం గర్వకారణం : మంత్రి గంగుల

కరీంనగర్, సెప్టెంబర్ 15 : తెలంగాణ నూతన సచివాలయానికి బాబాసాహెబ్ బీ.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టడం యావత్ జాతికి గర్వకారణమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.

సమాజంలోని ప్రతి ఒక్కరిని సమాన దృష్టితో చూసి దళిత, వెనుకబడిన వర్గాల సమానత్వం కోసం పోరాడిన మహనీయుడి పేరును వందలకోట్లతో నిర్మించిన అత్యాధునిక సచివాలయానికి పెట్టడం ద్వారా తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

ఈ చర్యతో దళిత, వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవం మరింత పెరిగిందని మంత్రి గంగుల తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణ సచివాలయానికి అంబేద్కర్ పేరు హర్ష నీయం

**– మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం**

ఖమ్మం, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): నూతనంగా నిర్మిస్తున్న సచివాలయానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పేరు పెట్టడం హర్షణీయమని తెరాస రాష్ట్ర నాయకులు, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. చట్ట సభలు వాటి నిర్వహణ ఎలా ఉండాలో అంబేద్కర్ ఒక దిశానిర్దేశం చేశారన్నారు. అటువంటి మహనీయుని పేరు తెలంగాణ సచివాలయానికి నామకరణం చేయడం కేసీఆర్‌కు విలువల పట్ల ఉన్న గౌరవానికి నిదర్శనమని స్పష్టం చేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాలకు ఉపయోగపడే అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన జరిగే శాసనసభకు అంబేద్కర్ పేరు అన్ని విధాల సముచితం అని పొంగులేటి పేర్కొన్నారు.

# తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు : ఎంపీ లక్ష్మణ్

రంగారెడ్డి, సెప్టెంబర్ 15: వికారాబాద్ జిల్లాలో బీజేపీ భరోసా బైక్ ర్యాలీ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యుడు లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ చేపట్టిన 'మీ సమస్యలపై నా పోరాటం' వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణలో సీఎం కేసీఆర్ నిరంకుశత్వంపై ప్రజలు, ఉద్యోగులు విసిగిపోయారన్నారు. జేపీ నడ్డా, అమిత్ షా పిలుపు మేరకు ఇవాళ బీజేపీ ర్యాలీ నిర్వాహిస్తోందన్నారు. తెలంగాణలో ఎక్కడ చూసిన ల్యాండ్, లిక్కర్, ఇసుక మాఫీ ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని మోదీ పాలనపై నమ్మకంతో ప్రజలు బీజేపీకి మద్దతుగా ఉన్నారన్నారు. టీఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీలపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. తెలంగాణలో ఈ నెల 17న తెలంగాణ విమోచన దినం ప్రభుత్వం జరపకపోవడం సిగ్గుచేటన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పొరడిన చాకలి ఐలమ్మ, కొమరం బీమ్‌ల చరిత్రను ప్రజలకు తెలియ చేయాలన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వాని కూకటి వేళ్లతో పీకి వేయడానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని లక్ష్మణ్ పిలుపు ఇచ్చారు.

# సిద్దిపేట్ లోని టి.ఎస్. ఎస్సీ స్టడీ సర్కిల్ లో ఉచిత కోచింగ్

సిద్ధిపేట్ లోని టి.ఎస్. ఎస్సీ స్టడీ సర్కిల్ లో సుమారు (100) ఎస్సీ, ఎస్టీ, బిసి, మరియు మైనారిటీ అభ్యర్థుల కొరకు మెదక్ ఉమ్మడి జిల్లా సిద్దిపేట నందు 19 అక్టోబర్, 2022 నుండి 18 మార్చి, 2022 వరకు బ్యాంకింగ్, ఆర్.ఆర్.బి, మరియు ఎస్.ఎస్.సి తో సహ (5) నెలల ఫౌండేషన్ కోర్స్ కొరకు ఉచిత కోచింగ్ ఇవ్వబడును. అందుకు గాను డిగ్రీ, పి.జి విద్యార్హతలు గల ఎస్సీ, ఎస్టీ, బిసి, మరియు మైనారిటీ విద్యార్థులు ఉచిత కోచింగ్ కు గాను వెబ్సైట్ www.tsscstudycircle.co.in ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకొన గలరని కోరుచున్నము. ధరఖాస్తుల స్వీకరణ కొరకు చివరి తేదీ : 24.09.2022, ఇట్టి ఫౌండేషన్ కోర్స్ ఎంట్రన్స్ ప్రతిభ డిగ్రీ కాలేజీ, సిద్దిపేట్ నందు తేదీ: 02.10.2022 న ఉదయము 11.00 గంటల నుండి మధ్యాహ్నము 01.00 గంటల వరకు నిర్వహించబడునని సిద్దిపేట్ లోని టి.ఎస్. ఎస్సీ స్టడీ సర్కిల్, డైరెక్టర్ శ్రీ. శ్రీకాంత్ గారు తెలియచేయదమయినది. ధరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు సంభదిత హాల్ టిక్కెట్లను వెబ్సైట్ www.tsscstudycircle.co.inనుండి పొందగలరు. గతంలో ఉచిత శిక్షణ పొందిన అభ్యర్థులు అనర్హులు, మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9182220112 ను సంప్రదించగలరు.

# 1 నుండి 19 సంవత్సరాలలోపు ప్రతి పిల్లవాడు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి



మెదక్, సెప్టెంబర్ 15 : నేటినిజం (ప్రతినిధి):నులిపురుగుల వల్ల పిల్లలు అనారోగ్యం పాలవుతారని, ఇది ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపిస్తుందని కాబట్టి 1 నుండి 19 సంవత్సరాలలోపు ప్రతి పిల్లవాడు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ సూచించారు. జాతీయ నులిపురుగులు నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక తెలంగాణ మైనారిటీ మహిళా గురుకుల పాఠశాలలో బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణి చేసి వేసుకోవలసినదిగా సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నులి పురుగు వల్ల శరీరం ఎదుగుదల ఆగిపోతుందని, పోషకాహార లోపం, రక్తహీనతలతో నీరసించి పోతారని, చదువుపై శ్రద్ధ చూపలేరని, ఏకాగ్రత లోపిస్తుందని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పరిశుభ్రత పాటించడం వల్ల ఈ సమస్యను అధిగమించవచ్చని , ఈ దిశగా విద్యార్థులు అవగాహన పెంపొందించుకొని భోజనం చేసేముందు, మరుగుదొడ్డికి వెళ్లిన తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి ఉపయోగించాలని, ఆహారాన్ని కప్పి ఉంచాలని, స్వచ్ఛమైన నీటిని తాగాలని సూచించారు. ఇట్టి వ్యాధి నివారణకు గాను కేంద్ర ప్రభుత్వం గత ఐదు సంవత్సారాల నుండి ప్రతి ఏటా ఆగస్టు, ఫిబ్రవరి మాసాలలో ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తున్నదని అన్నారు. జిల్లాలో 1,076 అంగన్వాడీ కేంద్రాలు, 1,062 పాఠశాల, 42 జూనియర్ కళాశాలలో ఉన్న విద్యార్థులతో పాటు బడిబయట ఉన్న 1 నుండి 19 ఏళ్ల లోపు పిల్లలు2,21,000 మంది ఉన్నారని గుర్తించి, ఈ రోజు అందరికి మాత్రలు పంపిణి చేస్తున్నామని, తప్పకుండా వేసుకోవాలని సూచించారు. 1 నుండి 2 సంవత్సరాల వయసున్న పిల్లలైతే ఆల్బెండజోల్ సగం మాత్ర వేసుకోవాలని, 2 నుండి 3 సంవత్సరాల వయసున్న పిల్లలైతే మాత్రను పొడి చేసుకొని రెండు చెంచాలు మాత్రమే కొద్దిగా నీరు కలిపి తీసుకోవాలని అన్నారు. అదే 3 నుండి 19 సంవత్సరాల వయసున్న వారు ఆల్బెండజోల్ ఒక టాబ్లెట్ ను పూర్తిగా వేసుకోవాలని తద్వార పిల్లలలో చురుకుదనం పెరుగుతుందని, ఎంతో హుషారుగా ఉంటారని అన్నారు. ఏదేని అనివార్య కారణాలవల్ల నేడు మాత్రలు తీసుకోలేని వారు తిరిగి ఈ నెల 22 న పంపిణి చేసేటప్పుడు మాత్రలు తీసుకొని వేసుకోవాలని, మాత్ర తీసుకోవడం వల్ల ఎటువంటి దుష్పరిమాణాలు (సైడ్ ఎఫెక్ట్) ఉండవని ప్రతిమ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మైనారిటీ అధికారి జెంలా, పాఠశాల రాధానాచార్యులు కవిత, డాక్టర్లు నవీన్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీను కలిసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): ఏసీబి కోర్ట్ కరీంనగర్ లో విధులు నిర్వహిస్తున్న స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల లక్ష్మీ ప్రసాద్ పదోన్నతి పై గురువారం సిరిసిల్ల అసిస్టెంట్ సెషన్ కోర్ట్ లో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా బాధ్యతలు చేపెట్టిన లక్ష్మీప్రసాద్ జిల్లా ఎస్పీ ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

# బీజేపీకి తెలంగాణలో అడ్డుకట్ట వేయడమే కర్తవ్యం : మంత్రి పువ్వాడ అజయ్

- కూనంనేని సాంబశివరావుకు మంత్రి పువ్వాడ అజయ్ శుభాకాంక్షలు
- సీఎం కేసీఆర్ పోరాటంలో కలిసి రావాలి



ఖమ్మం, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): భారత కమ్యూనిస్ట్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులై మొదటి సారి ఖమ్మం విచ్చేసిన సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావుకు కృష్ణ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన అభినందన సభలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు.

ప్రస్తుతం భారత దేశంలో ఆర్థిక సంక్షోభం, మతోన్మాదం, నెలకొన్న నేపథ్యంలో దేశానికి కమ్యూనిస్టుల అవసరం పెరుగుతున్నదని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులు పురోగమిస్తున్నారని, పలు దేశాల్లో జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టులు విజయం సాధించడం ఇందుకు నిదర్శనమని అన్నారు.

శ్రీలంక లాంటి పరిస్థితులే దేశంలో ఉన్నాయని, ఈ సంక్షోభానికి ప్రత్యామ్నాయం సోషలిజమేనని మంత్రి స్పష్టంచేశారు. దేశాన్ని అమ్ముకొంటున్న మోదీ పాలనకు వ్యతిరేకంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు వెంటే కమ్యూనిస్టుల ప్రయాణం సాగాలని సూచించారు.

దేశాన్ని నాశనం చేస్తున్న బీజేపీని పారద్రోలడానికి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకై మతోన్మాద బీజేపీకి తెలంగాణలో అడ్డుకట్ట వేయడమే కర్తవ్యంగా భావించి కృషి చేయాలని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కోరారు.

బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను ఏకం చేసేందుకు తెలంగాణ సీఎం కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలను సంపూర్ణంగా సమర్థించాలని విజ్ఞప్తి చేశారు. దేశ ప్రజలకు కాషాయ రాజకీయ పాలన ముప్పుగా మారిందని ఆ పార్టీ రాష్ట్రాల్లో అమ్మకాలు, కొనుగోళ్లు అనే దుర్మార్గమైన సిద్ధాంతాలను పాటిస్తున్నదని మండిపడ్డారు. ఇతర పార్టీల నేతలను డబ్బు పెట్టి కొనేందుకు దుకాణం మొదలెట్టిందని మంత్రి అజయ్ విమర్శించారు.

# వైభవోపేతంగా తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలు



- సెప్టెంబర్ 17 తెలంగాణ జాతీయ సమైక్యతా దినం
- సమిష్టిగా అందరూ ఉత్సవాల్లో పాల్గొని మనమంతా భారతీయులం అనే జాతీయ స్ఫూర్తిని చాటాలి
- 18న నిర్వహించే వజ్రోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి పువ్వాడ

ఖమ్మం, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రాధాన్యత, ఈ ప్రాంత విశిష్టతను చాటిచెప్పేలా జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలను అట్టహాసంగా, వైభవోపేతంగా నిర్వహించుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు.

ఈ నెల 16, 17, 18వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సమైక్యతా వజ్రోత్సవాల్లో భాగంగా 18వ తేదీ సాయంత్రం సర్దార్ పటేల్ స్టేడియం నందు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధ్వర్యంలో సాయంత్రం 5 గంటల నుండి 9గంటల వరకు నిర్వహించే వలు సాంస్కృతిక కార్యక్రమాల వాల్ పోస్టర్ ను గురువారం మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో వాల్ పోస్టర్ ను మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలసి మంత్రి పువ్వాడ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లడుతూ..

ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మూడు రోజులపాటు పండగ వాతావరణంలో తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ను అదేశించారు.

తెలంగాణ ప్రాధాన్యతను చాటేలా పెద్ద ఎత్తున ఈ ఉత్సవాలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించినందున, ప్రతి అంశాన్ని ప్రాముఖ్యమైనదిగా భావిస్తూ ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వం ఆశించిన దానికంటే మరింత విస్తృత స్థాయిలో నిర్దేశిత కార్యక్రమాలను నిర్వహించి వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఉద్బోధించారు.

ఈ సందర్భంగా జిల్లాలో ఉత్సవాల నిర్వహణ కోసం చేపడుతున్న ఏర్పాట్ల వకడ్బందీగా నిర్వహించాలన్నారు.

భారతదేశానికి 1947 ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్యం సిద్దించగా, తెలంగాణ ప్రాంతం మాత్రం 1948 సెప్టెంబర్ 17న రాచరిక పాలన నుండి ప్రజాస్వామిక పాలనలోకి వచ్చిందన్నారు.

ఇది జరిగి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రాంత ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా పెద్ద ఎత్తున తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించిందన్నారు.

ఏడాది పొడుగునా ఈ ఉత్సవాలు కొనసాగనుండగా, సెప్టెంబర్ 16 , 17 ,18 తేదీలలో వజ్రోత్సవ వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమాలు అట్టహాసంగా, వైభవోపేతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

యువత, మహిళలు, విద్యార్థులు, రైతులు అన్ని వర్గాల ప్రజలు ఈ ఉత్సవాల్లో పాల్గొని మనమంతా భారతీయులం అనే స్ఫూర్తిని చాటాలని మంత్రి పువ్వాడ పిలుపునిచ్చారు.

16వ తేదీన అన్ని శాసనసభ నియోజకవర్గ కేంద్రాల్లో పెద్ద ఎత్తున జాతీయ పతాకాలను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించిన మీదట, బహిరంగ సభలో వజ్రోత్సవాల ప్రాధాన్యతను, తెలంగాణ రాష్ట్ర ప్రాముఖ్యత గురించి వక్తలు వివరిస్తారని అన్నారు.

17వ తేదీన జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేయడం జరుగుతుదన్నారు.

పంద్రాగస్టు తరహాలోనే జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో భాగంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నందు పాల్గొని ఉదయం 9గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తానని వివరించారు.

18న జిల్లా కేంద్రంలో సాంస్కృతిక ప్రదర్శనలు, స్వాతంత్ర్య సమరయోధులకు సన్మాన కార్యక్రమాలు ఉంటాయని అన్నారు.

అన్ని వర్గాల ప్రజలు ఈ ఉత్సవాల్లో భాగస్వాములై తెలంగాణ రాష్ట్ర విశిష్టతను, స్ఫూర్తిని చాటిచెప్పాలని మంత్రి పువ్వాడ కోరారు.

# సీబీసీ కళాకారుల ప్రదర్శనలతో రంగుల హరివిల్లుగా కర్తవ్య పథ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకి చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో జరుగుతున్న సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. కర్తవ్య పథ్ ప్రారంభోత్సవం మరియు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని నెలరోజుల పాటు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కి చెందిన సాంగ్ అండ్ డ్రామా విభాగం కళాకారులు వినోదం, విద్య తో కూడిన సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ప్రదర్శిస్తున్నారు. సంగీతం, నృత్యం, వీధి నాటకాలు, వినోద కార్యక్రమాలు, ప్రదర్శనలు ప్రజలను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

స్టెప్ ప్లాజా ఓపెన్-ఎయిర్ వేదికపై జరిగే కార్యక్రమాలను ప్రతిరోజూ సూర్యాస్తమయం తర్వాత అన్ని వయసుల వారు ఉచితంగా చూడవచ్చు. రాత్రి 8 గంటల వరకు కార్యక్రమాలు జరుగుతాయి. .

వారాంతాల్లో కార్యక్రమాలు మరింత ఆకర్షణీయంగా నిర్వహించడం జరుగుతుంది. భారతదేశం గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే విధంగా ఆధునిక మేళవింపుతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తారు.

వినోదంతో కార్యక్రమాల ద్వారా ప్రజలకు సమాచారం అందించి వారిని చైతన్యవంతులను చేయాలన్న లక్ష్యంతో వినూత్నంగా కార్యక్రమాలను రూపొందించడం జరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ప్రజలు సులువుగా అర్థం చేసుకునే విధంగా సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ రూపొందించింది. 17 సెప్టెంబర్ 2022న నిర్వహించనున్న రక్తదన్ అమృత్ మహోత్సవ్ (రక్తదాన కార్యక్రమం ) వంటి ముఖ్యమైన కార్యక్రమాలపై కూడా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

భారతదేశ ఘనమైన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల బృందాలు ప్రత్యేక ప్రదర్శనలు ఇస్తాయి. ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసి వారికి వైవిధ్యంతో కూడిన వినోదాన్ని అందించేందుకు కథక్, ఒడిస్సి లాంటి జానపద ప్రదర్శనలు ఉంటాయి. ఇండియా గేట్ ను సందర్శించే సందర్శకుల కోసం శాస్త్రీయ వాయిద్య సంగీత ప్రదర్శనలు కూడా ఏర్పాటయ్యాయి. దేశభక్తి గీతాలు మరియు స్వాతంత్ర్య ఉద్యమం ఆధారంగా రూపొందిన సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' సందేశాన్ని మరింత ఎక్కువగా వ్యాప్తి చేయనున్నాయి.

ఇండియా గేట్ వద్ద నేతాజీ విగ్రహాన్ని ఆవిష్కరించడానికి ఏర్పాటైన కార్యక్రమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్‌పై పాడే పాటలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. జాతీయ వీరుడికి నివాళిగా ప్రతి ప్రదర్శన బోస్ ఇండియన్ నేషనల్ ఆర్మీ కవాతు పాట అయిన "కదం కదమ్ బాధయే జా" పాటతో ముగుస్తుంది.

నేతాజీ జీవితం మరియు ఆదర్శాలపై రూపొందిన స్కిట్‌లు, వీధి నాటకాలు, నృత్య నాటికలు మొదలైనవి నెల రోజుల పాటు ప్రజలను అలరించనున్నాయి. ఈ ఏడాది గాంధీ జయంతి వేడుకల్లో భాగంగా ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహణకు రంగం సిద్ధం అవుతోంది. ప్రదర్శనలకు భారీ ఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని భాగస్వాములు కావాలని ప్రజలందరినీ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆహ్వానిస్తోంది.

# ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు ఆహ్వానం

మెదక్, సెప్టెంబర్ 15 : నేటినిజం (ప్రతినిధి):తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాల సందర్భంగా తేదీ 16-09-2022 నుండి 18-09-2022 వరకు మూడు రోజుల పాటు జిల్లా కేంద్రంలో నిర్వహించు కార్యక్రమాలలో పాల్గొనుటకు ఆహ్వానిస్తూ శ్రీయుత జిల్లా కలెక్టర్, మెదక్ గారి ఆహ్వాన పత్రికను ఇందువెంట జతపరచనైనది. దయచేసి తమరు వీలు చేసుకొని ఇట్టి కార్యక్రమాలకు హాజరై ప్రెస్ కవరేజి చేయవలసినదిగా కోరనైనది. డిపిఆర్ ఓ

# అమెరికాలో పంజాబ్ యువకుడిని కాల్చి చంపిన దుండగుడు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: ఓ పంజాబ్ యువకుడిని దుండగుడు తుపాకీతో కాల్చి హతమార్చాడు. ఈసంఘటన అమెరికాలోని జార్జియాలో చోటు చేసుకుంది. పంజాబ్‌లోని కపుర్తలా జిల్లా ధాపై గ్రామానికి చెందిన పరమ్‌వీర్ సింగ్, అమెరికాలోని జార్జియాలో గ్రోసరీ షాపు నిర్వహిస్తున్నాడు.

ఆఫ్రికా జాతీయుడైన ఒక వ్యక్తి పట్టపగలు తుపాకీతో ఆ షాప్‌లోకి ప్రవేశించాడు. పరమ్‌వీర్ సింగ్‌ను బెదిరించి డబ్బులు దోపిడీ చేశాడు. అనంతరం అతడిపై తుపాకీతో కాల్పులు జరిపాడు. కంప్యూటర్ పరికరాలను కూడా ఎత్తుకెళ్లాడు.

ఈ కాల్పుల్లో గాయపడిన పరమ్‌వీర్ సింగ్ అక్కడికక్కడే చనిపోయాడు. ఈ సంఘటనపై స్పందించిన అమెరికా పోలీసులు 26 ఏళ్ల నిందితుడు క్రిస్ కోప్లాండ్‌ను అరెస్ట్ చేశారు. మరోవైపు పరమ్‌వీర్ సింగ్ మృతదేహం పంజాబ్‌లోని సొంత గ్రామమైన ధాపై చేరుకుంది. దీంతో అతడి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ఒక్కడే కుమారుడైన పరమ్‌వీర్ సింగ్ మరణాన్ని వారు తట్టుకోలేపోతున్నారు. మరోవైపు ఆ గ్రోసరీ షాపులోని సీసీటీవీలో రికార్డైన ఈ సంఘటనకు చెందిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# నేటి నుండి మూడు రోజుల పాటు జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలలో ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలి

మెదక్, సెప్టెంబర్ 15 : నేటినిజం (ప్రతినిధి):నేటి నుండి మూడు రోజుల పాటు నిర్వహించే జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలలో ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని సమైక్యతా స్ఫూర్తిని చాటవలసినదిగా జిల్లా కలెక్టర్ ఎస్.హరీష్ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 1948 సెప్టెంబర్ 17 న తెలంగాణ ప్రాంతం భారత దేశంలో కలిసి 75 వసంతాలు పూర్తైన సందర్భంగా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని శాసన సభ నియోజక వర్గాలలో వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నదని అన్నారు. అందులో భాగంగా ఈ నెల 16న మెదక్, నరసాపూర్ శాసనసభ నియోజక వర్గాలలో 15 వేల మందితో నిర్వహించు ర్యాలీ, సభ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సెప్టెంబర్ 16:మెదక్ పట్టణంలో ఉదయం 11 గంటలకు మునిసిపల్ కార్యాలయం నుండి భారీ ర్యాలీ బయలుదేరి జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకుంటుంది. అక్కడ సభ అనంతరం పాల్గొన్న అందరికి భోజనం ఏర్పాటు చేశారు. నరసాపూర్ లో ఏం.పి .డి.ఓ. కార్యాలయం సమీపం నుండి అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకుంటుంది. అక్కడ సభ అనంతరం ర్యాలీలో పాల్గొన్న అందరికి భోజనం ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ 17:××కలెక్టరేట్ లో రాష్ట్ర పాడి పరిశ్రమ, మత్స్య శాఖా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సరిగ్గా ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ గావించిన అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తరువాత బాల,బాలికలచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహింపబడతాయి. పిదప హై టీ (తేనీటి విందు) ఏర్పాటు చేశారు. ×× హైదరాబాద్ లో ఆదివాసీ గిరిజన సమ్మేళనం కు జిల్లా నుండి ఎస్టీ ప్రజాప్రనిధులు, అధికారులు, స్వయం సహాయక సంఘ సభ్యులను మధ్యాన్నం 1. 30 గంటల వరకు చేరవేయుటకు ఆయా మండలాల నుండి ప్రత్యేక ఆర్.టి.సి. బస్సులను ఏర్పాటు చేశారు. ఆ బస్సులు ఉదయం 9 గంటల వరకు ఆయా మండలాల నుండి బయలుదేరి వెళతాయి. సెప్టెంబర్ 18:మెదక్ పట్టణంలోని స్థానిక ద్వారకా గార్డెన్ లో ఉదయం 10 గంటల నుండి మధ్యాన్నం 12 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహింపబడతాయి. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులకు, కళాకారులకు సన్మానం, మెమెంటోలు అందజేయబడతాయి. కార్యక్రమం అనంతరం భోజనం ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమాలలో అందరు పాల్గొని జయప్రదం చేయవలసినదిగా జిల్లా కలెక్టర్ హరీష్ కోరారు.

# బెంగళూరులో 16&17 సెప్టెంబర్,2022న ఆవర్తన్- రెండు రోజుల కార్యక్రమాన్ని నిర్వహించనున్న సిఓఇకె

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: ప్రజలతో అనుసంధానం అయ్యే ప్రయత్నంలో భాగంగా, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఫర్ ఖాదీ బెంగళూరులోని అంతర్జాతీయ కేంద్రం (బెంగళూరు ఇంటర్నేషనల్ సెంటర్ – బిఐసి)లో 16 ఉ 17 సెప్టెంబర్ 2022ల్లో రెండు రోజుల పాటు ఆవర్తన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీతో కలిసి ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కెవిఐసి)కి మద్దతుగా ఎంఎస్ఎంఇ మంత్రిత్వ శాఖ ద్వారా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఖాదీ (సిఓఇకె) యువతను, అంతర్జాతీయ మార్కెట్‌కు చేరువ కావాలనే లక్ష్యంతో దీనిని రూపొందించారు. ఢిల్లీ కేంద్రంగా (హబ్), బెంగళూరు, గాంధీనగర్, కోల్‌కొత, షిల్లాంగ్‌లు దాని చువ్వలుగా (స్పోక్స్) ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో సిఓఇకె అంతర్గత రూపకర్తలు (ఇన్‌హౌజ్ డిజైనర్లు) రూపకల్పన చేరసిన, గృహ వస్త్ర సముదాయాలను అన్ని తరాల ప్రేక్షకుల కోసం ప్రదర్శనలో ఉంచనున్నారు.

తమ తమ వస్త్రాలను, చీరెలను మార్కెట్ చేసుకునేందుకు ఖాదీ సంస్థలను ఆహ్వానించారు. దీనితో పాటుగా, సిఓఇకె బృందం ఖాదీ, దాని సూక్ష్మనైపుణ్యాలపై చర్చల సెషన్లను నిర్వహించందుకు ప్రణాళికలు వసింది. ఇందు కోసం సెప్టెంబర్ 16న రావలసిందిగా బెంగళూరులోని డిజైన్ కళాశాలల నుండి విద్యార్థులను ఆహ్వానించారు.

ఇందులో భాగంగా, ఖాదీ పునఃఅనుసంధానం, నూతన తరం కోసం ఖాదీ, ఖాదీ కోసం డిఎన్ఎ అన్న ఇతివృత్తాలపై ఖాదీ వారసత్వం, నిలకడగా కొనసాగించేందుకు సంభాషణలను ప్రోత్సహిస్తుంది. వివిధ కళా రూపాలను అనుసరించేవారికి చేరువ కావడం కోసం, ఖాదీతో కళాత్మకత ఎలా అల్లుకునిపోయి ఉన్నదో గుర్తించి, అంగీకరించడం కోసం ఖాదీ – కళాత్మకత అన్న సిఓఇకె మరొక చొరవ ఒక మాధ్యమం.

బెంగళూరులోని సమకాలీన యువ నృత్యకారిణి, నృత్యదర్శకురాలు అయిన కళ్యాణి శారదతో సిఓఇకె కలిసి పని చేస్తోంది.

ఆమె 17 సెప్టెంబర్ 2022న సాయంత్రం 6.00 గంటలకు ప్రత్యేకంగా నృత్య దర్శకత్వం వహించిన ఆవర్తన్‌ను బిఐసిలో ప్రదర్శించనుంది. ఆమె ప్రదర్శన ఖాదీ ప్రత్యక ప్రక్రియను చిత్రీకరించడమ లక్ష్యంగా పెట్టుకుంది. సిఓఇకె బృందం ప్రత్యేకంగా రూపొందించిన ఖాదీ వస్త్రాలను నాట్యకారులు ప్రదర్శించనున్నారు.

ఖాదీ స్ఫూర్తిని విస్తృత ప్రేక్షకుల దృష్టికి తీసుకువెళ్ళేందుకు, ఖాదీని ఇతర కళారూపాలతో సమ్మిళితం చేసి, నూతన అర్థాలతో ఖాదీని వివరించడాన్ని ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది. ఎగ్జిబిషన్, సెషన్ల ద్వారా ఖాదీని యువతతో అనుసంధానం చేయడంపై ఈ కార్యక్రమం దృష్టి కేంద్రీకరించి, ఖాదీ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు వేదికను అందిస్తాయి.

# సమైక్యత వజ్రోత్సవ వేడుకలు విజయవంతం చేయాలి ....ఈదురు రాజేశ్వరి ఎంపిపి.



మహబూబాబాద్, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలంలోని చిట్యాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రజలు, యువకులు, మహిళలతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ఈదురు రాజేశ్వరి హాజరై వారు మాట్లాడుతూ

పాలకుర్తి నియోజకవర్గంలో శుక్రవారం జరగబోయే రాష్ట్ర సమైక్యత వజ్రోత్సవ వేడుకల భారీ ర్యాలీని ప్రజలు,ప్రజా ప్రతినిధులు,పార్టీ శ్రేణులు అందరు కలిసి విజయవంతం చెయ్యాలని కోరారు.

అనంతరం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో స్కూల్ లో జాతీయ నులిపురుగుల దినోత్సవనీ సందర్భంగా విద్యార్థులకు నులిపురుగు మందు వేయడం జరిగింది. తరువాత మాట్లాడుతూ వానాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు రాకుండా విద్యార్థులు అందరూ పరిశుభ్రత పాటించాలని సూచనలు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రావుల శ్రీనివాస్ రెడ్డి, జూనియర్ పంచాయతీ కార్యదర్శి రాజు, ఐకెపి సిసి సుధాకర్, ఎఎన్ఎం మేరీ,గ్రామ పార్టీ అధ్యక్షులు కొల్లూరి రమేష్, ఉపాధ్యక్షులు మొగులగాని హరీష్,యూత్ అధ్యక్షులు దేశెట్టి మహేష్, నాయకులు ఆవుల కొమురల్లి, మాజీ సర్పంచ్ గట్ల లక్ష్మి నారాయణ,ఈదురు సోమయ్య, ఈదురు రాములు, చిప్పల స్వామి,వార్డు సభ్యులు వల్లపు కుమార్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కు, వివోఏలు,ఉపాధ్యాయులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీయర్లను ఘనంగా సన్మానించిన మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి): ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విష్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీయర్స్ డే సందర్భంగా మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముందుగా ఇంజనీయర్లతో కేక్ కట్ చేయించి, ఇంజనీయర్లందరికీ మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపి, తదనందరం ఇంజనీర్లు మధు రఘునందన్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్, రాగంపేట పవన, పంచాయతీ రాజ్, తోట దేవరాజు, రమణ, రుద్రసాయి, శివప్రసాద్ గార్లకు శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించడం జరిగింది.

రాజన్న ఆలయ డీ.ఈ. మధు రఘునందన్ మాట్లాడుతూ, ఇంజనీయర్ల దినోత్సవం సందర్భంగా మమ్మల్ని సత్కరించటం ఆనందంగా ఉంది అన్నారు.

ట్రస్టు సభ్యులు మధు మహేష్, నగుబోతు రవీందర్, డాక్టర్ బెజ్జంకి రవీందర్ మాట్లాడుతూ మాకు సన్మానం చేసే అవకాశం ఇచ్చిన ఇంజనీయర్లకు కృతజ్ఞతలు తెలుపుతూ,దాతల సహకారంతో కోవిడ్ సమయం నుండి ప్రారంభించిన అన్నదానం, ఇతర సేవాకార్యక్రమాలు నేటికి 491 రోజులు పూర్తి చేసుకోవడం జరిగిందని, సహకారం అందిస్తున్న దాతలకు, సేవలు అందిస్తున్న ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, నగుబోతు రవీందర్, డాక్టర్. బెజ్జంకి రవీందర్, నాగుల చంద్రశేఖర్, జూలపెల్లి రాజు, ప్రతాప నటరాజు, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, కళా అశోక్, పొలాస రాజేందర్, చల్లా సత్తయ్య, మారం ప్రవీణ్ కుమార్, పిన్నింటి హనుమాండ్లు, కేసోరాం సిమెంట్ కరీంనగర్ జిల్లా సేల్స్ ఆఫీసర్లు సునీల్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి తిరంగా బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

## -ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ పిలుపు



కరీంనగర్, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ జాతీయ సమైక్యత, వజ్రోత్సవ వేడుకల సందర్భంగా నగరంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు నమాజ్ అనంతరం ఎంఐఎం పార్టీ నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబోయే తిరంగా బైక్ ర్యాలీని నగరంలోని అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయం దారుస్సలామ్ లో గులామ్ అహ్మద్ మాట్లాడుతూ నమాజ్ ముగిశాక ఎన్ఎన్ గార్డెన్ చేరుకొని, సాలార్ చౌక్, అశోక్ నగర్ చౌరస్తా నుండి ర్యాలీగా బయలుదేరి, జాతీయ జెండాలు చేతబూని, జాతీయత ఉట్టిపడేలా నినాదాలు చేస్తూ, గాంధీ రోడ్ మంచిర్యాల చౌరస్తా, కోర్టు సర్కిల్, ఐబి చౌరస్తా, డి.ఎఫ్.ఓ చౌరస్తా, రాజీవ్ చౌక్, మదీనా కాంప్లెక్స్, కలెక్టర్ క్యాంప్ ఆఫీస్, బస్టాండ్ మీదుగా తెలంగాణ చౌక్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. విబేధాలకు తావులేకుండా, క్రమశిక్షణతో ఎలాంటి అంతరాయాలు సృష్టించకుండా, తమ పార్టీ బాధ్యుల స్వీయ పర్యవేక్షణలో ర్యాలీని బాధ్యతాయుతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం తెలంగాణ చౌక్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గేయాన్ని ఆలపించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ తిరంగా బైక్ ర్యాలీని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.




# ప్రభుత్వ లబ్ధిదారులకు రుణాల్లో జాప్యం వద్దు

హైదరాబాద్, సెప్టెంబర్ 15: ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారులకు జాప్యం లేకుండా రుణ వితరణ చేసి, రాష్ట్రంలోనే హైదరాబాద్ జిల్లా మొదటిస్థానంలో నిలుపాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు బ్యాంకర్లను కోరారు. ప్రభుత్వ పథకాలు అమలుకు సంబంధించిన అంశాలపై మంగళవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో అదనపు కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు అధికారులు నామినేట్ చేసిన బాధ్యత గల అధికారులు డీసీసీ సమావేశాలకు పూర్తి స్థాయిలో హాజరు కావాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత వ్యవధిలోగా గ్రౌండింగ్ చేయించాల్సిన బాధ్యత బ్యాంకు అధికారులదే అని అన్నారు.

ఈ సందర్భంగా లక్ష్యాలను సాధించకపోవడానికి గల కారణాలను బ్యాంకర్లను అడిగి తెలుసుకున్నారు. వివిధ బ్యాంకుల్లో గ్రౌండింగ్ పెండింగ్‌లో ఉన్న యూనిట్లకు వెంటనే పూర్తి చేయాలన్నారు. గ్రౌండింగ్ పూర్తయిన యూనిట్లకు యూసీలు వెంటనే ఇవ్వాలని బ్యాంకర్లను ఆదేశించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలో 2022-23 సంవత్సరానికి కేటాయించిన రూ.21,273.40 కోట్లు గాను ఈ ఏడాది జూన్ 2022 ఆఖరుకు రూ.13,390.64 కోట్లకు అంటే 63 శాతం పథకాలు గ్రౌండింగ్ సాధించినట్లు తెలిపారు. అలాగే ప్రయారిటీ సెక్టార్‌లో రూ.25,413 కోట్లకు గాను రూ.16,607.22 కోట్లు అంటే 65 శాతం గ్రౌండింగ్ సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ అధికారి ప్రవీణ్‌కుమార్, మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఖాసీం, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా 540 స్టోర్ల వ్యాప్తంగా విస్తరించేందుకు రిలయన్స్ రిటైల్‌తో భాగస్వామ్యం చేసుకున్న అకాయ్ ఇండియా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: రిలయన్స్ రిటైల్‌తో భాగస్వామ్యం చేసుకున్న జపనీస్ తయారీదారు అకాయ్. తమ పోర్ట్‌ఫోలియో విస్తరించడంతో పాటుగా దేశంలో మార్కెట్ పరిమాణం విస్తరించడంలో భాగంగా అకాయ్ స్మార్ట్ టీవీ విడుదల బెంగళూరు, సెప్టెంబర్ 14, 2022:అకాయ్ ఇండియా ఇప్పుడు రిలయన్స్ రిటైల్‌తో భాగస్వామ్యం చేసుకుని తమ పోర్ట్‌ఫోలియో, చేరికను భారతదేశ వ్యాప్తంగా విస్తరించనుంది. భారతదేశ వ్యాప్తంగా 540కు పైగా స్టోర్స్‌లో దీని ఉత్పత్తులు అందుబాటులో ఉండనున్నాయి. దీనిద్వారా అకాయ్ యొక్క వినూత్నమైన హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉత్పత్తులు మరింత మంది వినియోగదారులకు చేరువవుతాయి. అకాయ్ స్మార్ట్‌టీవీని ప్రత్యేక పరిచయ ధర 9999 రూపాయలలో విడుదల చేయనున్నారు. ఈ 32 అంగుళాల టీవీ కేవలం రిలయన్స్ రిటైల్ మార్కెట్ వద్ద మాత్రమే లభ్యమవుతుంది. అకాయ్ ఇండియా డైరెక్టర్ అనురాగ్ శర్మ మాట్లాడుతూ "రిలయన్స్ రిటైల్‌తో ఈ భాగస్వామ్యం కేవలం ప్రతిష్టాత్మకమైనది మాత్రమే కాదు మా ఇరు సంస్థలకూ అత్యంత ప్రయోజనకరమైనది. ఈ భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉత్పత్తులను అకాయ్ అందించగలగడంతో పాటుగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌లో మరింతగా విస్తరిస్తుంది. ఇది వినియోగదారులకు తాజా, వినూత్నమైన సాంకేతికతను అందించేందుకు సైతం తోడ్పడనుంది" అని అన్నారుక న్యూమర్ ఎలక్ట్రానిక్స్ మార్కెట్ 2022?2030 మధ్యకాలంలో 6.5 % సీఏజీఆర్‌తో 2030 నాటికి 124.94 బిలియన్ యుఎస్‌డీకి చేరవచ్చని అంచనా. ఈ మార్కెట్ 2021 నాటికి 71.2 బిలియన్ యుఎస్‌డీగా ఉంటే దీనిలో టీవీల వాటా అత్యధికంగా ఉంది. రిలయన్స్‌తో అకాయ్ భాగస్వామ్యం కారణంగా 2021లో 55%కు పైగా అమ్మకాలు పెరిగాయి. ఈ భాగస్వామ్యంలో భాగంగా నూతన ఆవిష్కరణలను సైతం విజయవంతంగా రెండు సంస్థలూ చేస్తున్నాయి.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. T.S. 'Editor: B. Devadas.
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com